

ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE


WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక: 52 | ఎడిటర్: మేనం శ్యామ్ | గురువారం 10-09-2026 | పేజీలు: 10

సిరా చుక్క

పాగడ్తల మత్తు.. రాజకీయం చిత్తు...!
నియోజకవర్గ రాజకీయాల్లో
ఇది కొత్త కథేమీ కాదు...
కానీ నిరంతరం పునరావృతమయ్యే
పాత ముప్పు ఒక్కటే:
'భజన బృందాలు'!
నేతలు మంచివారే కావచ్చు, కానీ
చుట్టూ ఉన్న 'చెంచాలు'
రంగుల అద్దాలు తొడిగితే
అసలు ప్రజాభిప్రాయం
ఎలా కనిపిస్తుంది?
నాయకుడు ఏది చేసినా "జై కొట్టడం"
తప్ప, తప్పును తప్పు అని చెప్పే ధైర్యం
లేని కొంతమంది స్వార్థపరులు
క్షేత్రస్థాయి వాస్తవాలు నేతలకు
అందకుండా గోడలు కడుతున్నారు.
గత చరిత్ర పేజీలు తిరగేస్తే...
పలువురు ప్రజాప్రతినిధుల
రాజకీయ ప్రయాణాల్లో ఈ పాగడ్తల
సంస్కృతి చేసిన నష్టం
స్పష్టంగా కనిపిస్తుంది.
ప్రస్తుతం ఉన్న ప్రజాప్రతినిధుల చుట్టూ
కూడా ఇదే తరహా 'భజన పరులు'
గూడు కట్టారనే విమర్శలు రావడం
గమనార్హం.,

రౌతు సంతు. ....



ఫాంహౌస్‌లో కుట్ర.. అసెంబ్లీని అడ్డుకునే పన్నాగం

హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో : బీఆర్ఎస్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ సభ్యులు కుట్ర చేశారని ఆరోపించారు. మూడు రోజులుగా చోటుచేసుకున్న ఘటనలకు ఎర్రవల్లి ఫాంహౌస్‌నే వేదికగా కుట్రకు ప్రణాళికలు రూపొందించారని అన్నారు. బుధవారం అసెంబ్లీలో పలు అంశాలపై మాట్లాడిన సీఎం.. ఈ ఘటనలపై సమగ్ర విచారణకు ఆదేశించామని తెలిపారు.

6న ఫాంహౌస్‌లో కుట్ర..
7న స్పీకర్‌పై మాటల దాడి..

ఈ నెల 6వ తేదీన ఫాంహౌస్‌లో కుట్ర జరిగిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 7వ తేదీన స్పీకర్‌పై మాటల దాడి జరిగిందని, 8వ తేదీన శుద్ధి కార్యక్రమం చేపట్టారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎదుట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై కొందరు దాడి చేశారని, స్పీకర్‌తో పాటు ఆయన తల్లిని కూడా అవమానించారని సీఎం తెలిపారు.



కుట్ర చేసిన వారికీ..
అమలు చేసిన వారికీ శిక్ష..

దళితులను ఉద్దేశపూర్వకంగా అవమానించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, విద్వేషాలు, అల్లర్లు రెచ్చగొట్టడం నేరమని సీఎం హెచ్చరించారు. దళితులపై అణచివేత, దురాగతాలకు పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కుట్ర చేసిన వారితో పాటు దానిని అమలు చేసిన వారినీ కోర్టులో నిలబెట్టి శిక్షించాలని నిర్ణయించామని స్పష్టం చేశారు. ఈ కేసు విచారణ అధికారిగా ఐపీఎస్ విజయ్‌కుమార్‌ను నియమించినట్లు వెల్లడించారు.

దళితుల నిరసనపై
సీఎం వివరణ...

ఉత్తరాఖండ్‌లో జరిగిన ఘటనను ఖండిస్తూ రాష్ట్రపతికి ఫిర్యాదు చేసిన విషయాన్ని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. అదే తరహా ఘటన తెలంగాణలో చోటుచేసుకుందని అన్నారు. ఫాంహౌస్‌లో జరిగిన కుట్రలకు వ్యతిరేకంగానే దళితులు అక్కడ నిరసన తెలిపేందుకు వెళ్లారని, దాడుల కోసం కాదని పేర్కొన్నారు. ప్రజాస్వామిక పద్ధతిలో డప్పు కొట్టి దండోరా వేయడం ద్వారా తమ నిరసనను వ్యక్తం చేశారని తెలిపారు.

మిగతా 2లో

సీఎం రేవంత్

- అసెంబ్లీ సమావేశాలకు ముందురోజు ఎర్రవల్లి ఫాంహౌస్‌లో కుట్ర జరిగిందన్న సీఎం రేవంత్‌రెడ్డి
- మూడు రోజుల ఘటనలపై సమగ్ర విచారణకు ఆదేశాలు
- విచారణ అధికారిగా ఐపీఎస్ విజయ్‌కుమార్ నియామకం
- దళితులను అవమానించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, విద్వేషాలు రెచ్చగొట్టడం నేరమని హెచ్చరిక
- కుట్ర చేసిన వారితో పాటు అమలు చేసిన వారినీ చట్టపరంగా శిక్షిస్తామని స్పష్టం
- 22ఏ భూములు సహా ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకే కుట్ర చేశారని బీఆర్ఎస్‌పై ఆరోపణ

సీఎం రేవంత్‌పై ఏకవచన వ్యాఖ్యలు అసెంబ్లీలో దుమారం

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని ఏకవచనంతో సంబోధించడంపై స్పీకర్ అభ్యంతరం
- సభ ఔన్నత్యాన్ని కాపాడాలని, సజావుగా సాగేందుకు సహకరించాలని గడ్డం ప్రసాద్ కుమార్ విజ్ఞప్తి
- ఏలేటి వ్యాఖ్యలు బాధాకరమన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- బీజేపీ, బీఆర్ఎస్‌లపై మంత్రి సీతక్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్‌బాబు తీవ్ర విమర్శలు
- 22ఏ భూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చకు సిద్ధమని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి



హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో : తెలంగాణ అసెంబ్లీలో బుధవారం అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఏకవచనంతో సంబోధించడంపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఎంను అవమానిస్తూ ఏకవచనంతో మాట్లాడుతుంటే ఏం చేయాలని ప్రశ్నించారు. సభ సజావుగా సాగేందుకు సభ్యులు సహకరించాలని కోరారు.

ఏకవచనంతో మాట్లాడటం సరికాదు..

సభలో మైక్ ఇస్తే సీఎం రేవంత్‌రెడ్డిని ఏకవచనంతో మాట్లాడటం సరికాదని

మిగతా 2లో

ఎర్రవల్లి ఫాంహౌస్ శుద్ధి

- దళితులను అవమానించారంటూ ఎమ్మెల్యే ఫిర్యాదు
- దళితులు వెళ్లిన తర్వాత పసుపు నీటితో ఫాంహౌస్‌ను శుద్ధి చేశారంటూ ఆరోపణ
- బీఆర్ఎస్ నేత సంధ్యా రాణిపై సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఫిర్యాదు
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై తాతా మధు, నవీన్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలపైనా ఫిర్యాదు
- బీఆర్ఎస్ నరనరాల్లో దళిత వ్యతిరేకత ఉందని ఎమ్మెల్యే సత్యం తీవ్ర విమర్శ
- ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్న వారందరిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్



2 లో

మహిళా ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తన దారుణం : మంత్రి సీతక్క

- బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల ఆ పార్టీ సభ్యులు అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపణ
- సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిని వెనుక నుంచి ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి తోశారని మంత్రి వ్యాఖ్య
- మహిళా ఎమ్మెల్యేల మధ్యలోకి చొరబడి వారిని తాకుతూ ముందుకు రావాల్సిన అవసరం ఏముందని ప్రశ్న
- ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సబితా ఇంద్రారెడ్డిపై ఆ పార్టీ సభ్యులే చేయి వేశారని ఆరోపణ
- మహిళా నేతల పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలది 'కీచకపర్వం' అంటూ సీతక్క తీవ్ర విమర్శలు



హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో : బీఆర్ఎస్‌పై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సొంత పార్టీకి చెందిన మహిళా ఎమ్మెల్యేల పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దుర్మార్గంగా వ్యవహరించారని ఆరోపించారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆమె.. మహిళా ఎమ్మెల్యేల పట్ల బీఆర్ఎస్ సభ్యులు

మిగతా 2లో

దళితులు నడిచారని రోడ్డును శుద్ధి చేయడం దారుణం

- మంత్రి శ్రీహరి
- దళితులు నడిచిన రోడ్డును శుద్ధి చేయడం దారుణమైన ఘటన అని మంత్రి వాకిటి శ్రీహరి వ్యాఖ్య
- స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా అస్పృశ్యత కొనసాగడం బాధాకరమని ఆవేదన
- అహంకారపూరిత భావజాలాన్ని ప్రజలు సహించరని తీవ్ర వ్యాఖ్యలు
- మహిళా ఉద్యోగుల ముందు దుస్తులు విప్పిన ఘటనపై సభ్య సమాజం తలదించుకుంటోందని విమర్శ
- కేసీఆర్ సభకు వచ్చి సలహాలు, సూచనలు ఇవ్వాలని సీఎం రేవంత్ పలుమార్లు ఆహ్వానించారని వెల్లడి

2 లో



గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. ప్రభుత్వ తీరుపై ఫిర్యాదు

- తెలంగాణలో తాజా పరిస్థితులను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దృష్టికి తీసుకెళ్లిన కేటీఆర్
- మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని ఆరోపణ
- సబితా ఇంద్రారెడ్డిపై పోలీసుల దాడి దృశ్యాలను గవర్నర్‌కు చూపించిన బీఆర్ఎస్ నేతలు
- సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి దుశ్శాసనపర్వం సృష్టించారని కేటీఆర్ ఆరోపణ
- కేసీఆర్ ఇంటి వద్ద కాంగ్రెస్ శ్రేణులు చావు డప్పు కొట్టిన అంశంపైనా ఫిర్యాదు

2లో

కేసీఆర్‌కు చెడు జరగాలని కాంగ్రెస్ ఎప్పుడూ కోరుకోలేదు

- మహేశ్ కుమార్ గౌడ్
- కేసీఆర్‌కు చెడు జరగాలని హరీశ్ రావు పూజలు చేశారని కవిత స్వయంగా చెప్పారన్న టీపీసీసీ అధ్యక్షుడు
- కేసీఆర్ బాత్‌రూమ్‌లో జారిపడినప్పుడు సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ ఛానల్ ద్వారా వైద్యం చేయించారని వెల్లడి
- కేసీఆర్ ఆరోగ్యం గురించి అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఆరా తీశారని గుర్తుచేసిన మహేశ్
- కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద 55 మంది సిబ్బందితో ప్రభుత్వం భద్రత కల్పించిందని వ్యాఖ్య
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు దళిత సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని విమర్శ



2లో

బొల్లారం ఆర్మీ క్యాంపులో ఆయుధాల మిస్సింగ్

- మూడు నెలలుగా విడతలవారీగా?
- ఒకేసారి కాకుండా గత మూడు నెలలుగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి మాయమైనట్లు అనుమానం
- ఏకే-203, ఇన్సాస్, 9 ఎంఎం పిస్టళ్లతో పాటు భారీగా బుల్లెట్లు, మ్యాగజైన్లు మిస్సింగ్
- ఫైరింగ్ రేంజ్ వద్ద 160 ఎల్రక్టికల్ డిటోనేటర్లు లభించడంతో పెరిగిన అనుమానాలు
- సీసీ కెమెరాల పుటేజీల్లో తెల్లవారుజామున అనుమానాస్పద బైక్ గుర్తింపు
- సిబ్బంది, ఆయుధాల గది భద్రత, హనీట్రాప్ కోణంలోనూ అధికారుల దర్యాప్తు

2 లో

సీఎం రేవంత్‌పై ఏకవచన వ్యాఖ్యలు అసెంబ్లీలో దుమారం

మొదటి పేజీ తరువాయి

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఏలేటి మహేశ్వర్ రెడ్డి అలా మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు. సభ ఔన్నత్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడి పైనా ఉందని స్పష్టం చేశారు.

బీజేపీ తీరుపై సీతక్క ఆగ్రహం..

ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. పోడియంలో ప్లకార్డులు ప్రదర్శించకూడదనే నిబంధన ఉన్నప్పటికీ బీజేపీ సభ్యులు పోడియంలోకి వచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. దళితులు నిరసన తెలిపిన ఎర్రవల్లి ఫాంహౌస్‌ను శుద్ధి చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత మల్లికార్జున ఖర్గే వెళ్లి వచ్చిన చోట బీజేపీ నేతలు కూడా అదే విధంగా శుద్ధి చేశారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల భావజాలం ఒకటేనని, బీఆర్ఎస్‌కు మద్దతుగా బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు.

దళితులను అవమానించారన్న కోమటిరెడ్డి..

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఏకవచనంతో సంబోధించిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ సభ్యులు అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. దళితులు నిరసన తెలిపిన ఎర్రవల్లి ఫాంహౌస్‌ను శుద్ధి చేసి వారిని అవమానించారని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు తెలంగాణలో దళితులు ఉండకూడదని కోరుకుంటున్నారా అని ప్రశ్నించారు.

22ఏ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చ..

బలహీన వర్గాల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఎర్రవల్లి ఫాంహౌస్ వ్యవహారం చాలా పెద్ద సామాజిక సమస్యగా మారిందని పేర్కొన్నారు. ఈ అంశంపై బీజేపీ నేతల వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో సంబంధిత అంశాలపై మాట్లాడకుండా బీజేపీ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. 22ఏ భూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కచ్చితంగా చర్చిస్తామని తెలిపారు.

సస్పెన్షన్‌పై ఏలేటి అభ్యంతరం..

మరోవైపు అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌ను ఏలేటి మహేశ్వర్ రెడ్డి తప్పుబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏమైనా ప్రత్యేక రూల్‌బుక్ పెట్టారా అని ప్రశ్నించారు. ఏ నిబంధన ప్రకారం బీఆర్ఎస్ సభ్యులపై సస్పెన్షన్ వేటు వేశారని నిలదీశారు. బీఏసీ నిర్ణయాల ప్రకారం సభను నడపాలని డిమాండ్ చేశారు. 22ఏ భూముల అంశంపై అసెంబ్లీలో చర్చించాలని పట్టుబట్టారు.

ఫాంహౌస్‌లో కుట్ర.. అసెంబ్లీని అడ్డుకునే పన్నాగం



మొదటి పేజీ తరువాయి

ప్రజా సమస్యలపై చర్చ జరగకూడదనే కుట్ర..

ప్రజా సమస్యలపై చర్చించేందుకే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. 22ఏ భూములు సహా అన్ని అంశాలపై చర్చించాలని భావించామని, అవి చర్చకు వస్తే బీఆర్ఎస్‌కు రాజకీయంగా తీవ్ర నష్టం జరుగుతుందనే ఉద్దేశంతోనే సమావేశాలను అడ్డుకునేందుకు కుట్ర చేశారని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాలకు ముందురోజు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఎర్రవల్లి ఫాంహౌస్‌కు పిలిపించుకుని కుట్ర పన్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ ప్రజలకు నమ్మకం, విశ్వాసానికి ప్రతీక అని సీఎం అన్నారు. అణచివేత, వివక్షకు గురైన వర్గాల అభివృద్ధి కోసం రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. దేశంలో సంక్షోభాలు ఎదురైనప్పుడు కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని, బ్రిటిష్ వారి దోపిడీ, దుర్మార్గాలకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర ఆ పార్టీదని పేర్కొన్నారు.

ఎర్రవల్లి ఫాంహౌస్ శుద్ధి

హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫాంహౌస్‌కు దళితులు వెళ్లిన అనంతరం పసుపు నీటితో శుద్ధి చేశారంటూ చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేత సంధ్యారాణి ఈ శుద్ధి కార్యక్రమం చేపట్టారని ఆరోపిస్తూ ఆమెపై చర్యలు తీసుకోవాలని సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సంధ్యారాణిపై పోలీసులకు ఫిర్యాదు..

సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఎమ్మెల్యే సత్యం.. దళితులను అవమానించేలా వ్యవహరించిన సంధ్యారాణిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. అనంతరం పోలీస్ స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడారు. దళితులు ఫాంహౌస్ వద్ద నిరసన తెలిపినందుకు పసుపు నీటితో శుద్ధి చేయడం తీవ్ర అవమానకరమని మండిపడ్డారు.

స్పీకర్‌పై వ్యాఖ్యలపైనా ఫిర్యాదు..

బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూడా ఫిర్యాదు చేసినట్లు మేడిపల్లి సత్యం తెలిపారు. బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలతో దళిత సమాజం ఏకతాటిపైకి వచ్చిందన్నారు.

దళిత వ్యతిరేకత నరనరాల్లో ఉంది..

కేసీఆర్ ఫాంహౌస్ వద్ద మంగళవారం దళితులు దప్పులతో నిరసన వ్యక్తం చేశారని ఎమ్మెల్యే తెలిపారు. వారు వచ్చిన ప్రాంతాన్ని పసుపు నీటితో శుద్ధి చేయడం ద్వారా బీఆర్ఎస్ నేతలు తమ అహంకారాన్ని చాటుకున్నారని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇలాంటి ఘటన ఎప్పుడూ చోటుచేసుకోలేదని అన్నారు. బీఆర్ఎస్ నరనరాల్లో దళిత వ్యతిరేకత ఉందని ఆరోపించారు.

అందరిపైనా చర్యలు తీసుకోవాలి..

ఈ ఘటనతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్న వారందరిపైనా కేసులు నమోదు చేయాలని పోలీసులను కోరినట్లు మేడిపల్లి సత్యం చెప్పారు. లక్షలాది మంది దళితుల మనోభావాలను గులాబీ పార్టీ దెబ్బతీసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సభ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది: కశిరెడ్డి

- **శాసనసభ గౌరవం, ప్రతిష్టను కాపాడటం ప్రతి సభ్యుడి బాధ్యత**
- **స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలపై అభ్యంతరం**
- **అనుచిత వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్‌బాబుకు కశిరెడ్డి వినతి**
- **ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**

హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :శాసనసభ గౌరవం, ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం అసెంబ్లీలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవితో కలిసి రాష్ట్ర అసెంబ్లీ వ్యవహారాల ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

తాతా మధు వ్యాఖ్యలపై అభ్యంతరం...

ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శాసనసభ స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలని వినతి...

మంత్రి శ్రీధర్‌బాబును కలిసి ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తగిన కఠిన చర్యలు తీసుకోవాలని కశిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. శాసనసభలో సభ్యుల ప్రవర్తనకు సంబంధించి గౌరవప్రదమైన వాతావరణం కొనసాగించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

మహిళా ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తన దారుణం : మంత్రి సీతక్క

మొదటి పేజీ తరువాయి

అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించారని విమర్శించారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను కూడా మంత్రి విడుదల చేశారు.

మహిళా ఎమ్మెల్యేలను వెనుక నుంచి తోశారని ఆరోపణ..

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిని ఆ పార్టీ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి వెనుక నుంచి తోశారని సీతక్క తెలిపారు. గంగుల కమలాకర్ మహిళా ఎమ్మెల్యేలను వెనుక నుంచి నెట్టుకుంటూ ముందుకు వచ్చారని ఆరోపించారు.

ఇద్దరు మహిళా నేతల మధ్యకు ఎందుకు?

పక్కపక్కనే నిలుచున్న ఇద్దరు మహిళా ఎమ్మెల్యేలను తాకుతూ సుధీర్ రెడ్డి మధ్యలోకి వచ్చారని సీతక్క విమర్శించారు. ఇద్దరు మహిళా సభ్యుల మధ్యకు చొరబడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. మహిళా నేతలకు అతుక్కుని ఎందుకు నిలబడ్డారని నిలదీశారు.

చేయి వేశారు అంటూ ఆరోపణ...

ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సబితా ఇంద్రారెడ్డిపై ఆ పార్టీ సభ్యులే చేయి వేశారని మంత్రి సీతక్క ఆరోపించారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి ప్రవర్తన ఏమాత్రం సమర్థనీయం కాదని అన్నారు.

కీచకపర్వం అంటూ సీతక్క ఫైర్...

మహిళా నేతల పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలది కీచక పర్వమని మంత్రి సీతక్క తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల జరిగిన వ్యవహారానికి సంబంధించిన దృశ్యాలను ప్రజల ముందుంచేందుకే విజువల్స్ విడుదల చేసినట్లు తెలిపారు.

కేసీఆర్‌కు చెడు జరగాలని కాంగ్రెస్ ఎప్పుడూ కోరుకోలేదు

హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరణాన్ని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కోరుకోలేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన.. కేసీఆర్‌కు చెడు జరగాలని ఎమ్మెల్యే హరీశ్ రావు పూజలు చేశారని కవిత స్వయంగా చెప్పారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎవరి చెడునూ కోరుకోదని స్పష్టం చేశారు.

కేసీఆర్ ఆరోగ్యంపై సీఎం రేవంత్ స్పందించారు..

కేసీఆర్ ఆరోగ్యం విషయంలో తమకు ఎలాంటి చెడు ఆలోచన లేదని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కేసీఆర్ బాత్‌రూమ్‌లో జారిపడిన సమయంలో గ్రీన్ ఛానల్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి వైద్యం చేయించిన విషయాన్ని గుర్తుచేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చిన సమయంలో ఆయన ఆరోగ్యం గురించి సీఎం రేవంత్ రెడ్డి అడిగిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు.

కేసీఆర్ అసెంబ్లీకి రావాలని సీఎం కోరుకున్నారు...

ప్రతిపక్ష నేతను కాంగ్రెస్ పార్టీ గౌరవిస్తుందని మహేశ్ తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి మాత్రమే కోరుకుంటున్నారని అన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్‌కు ఎలాంటి వ్యతిరేక ఆలోచన లేదని స్పష్టం చేశారు.

ఫామ్‌హౌస్ వద్ద 55 మందితో భద్రత..

కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద ప్రభుత్వం 55 మంది సిబ్బందితో భద్రత ఏర్పాటు చేసిందని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. కేసీఆర్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును పరిశీలిస్తే.. ఆయనకు చెడు జరగాలని కోరుకున్నామనే ఆరోపణలకు ఎలాంటి ఆధారం లేదని పేర్కొన్నారు.

తాతా మధుపై మహేశ్ విమర్శలు..

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రేవంత్ రెడ్డి అభిమాని అని, ఆ అభిమానంతోనే ఆయన అలా మాట్లాడి ఉండవచ్చని మహేశ్ వ్యాఖ్యానించారు. అదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తీరు దళిత సమాజాన్ని అవమానించే విధంగా ఉందని విమర్శించారు. దళితుల పట్ల గౌరవం ఉండాలని, బాధ్యతాయుతంగా వ్యాఖ్యలు చేయాలని సూచించారు.

బొల్లారం ఆర్మీ క్యాంపులో ఆయుధాల మిస్సింగ్

సికింద్రాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ క్యాంపులో ఆయుధాలు, మందుగుండు సామగ్రి మిస్సింగ్ వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. తొలుత ఒకేసారి ఆయుధాలు మాయమైనట్లు భావించినప్పటికీ.. ప్రాథమిక దర్యాప్తులో అవి గత మూడు నెలలుగా విడతలవారీగా బయటకు తరలించి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నట్లు సమాచారం. ఏకే-203 రైఫిళ్లు, ఇన్సాస్ రైఫిల్, 9 ఎంఎం పిస్టళ్లతో పాటు 2 వేలకు పైగా బుల్లెట్లు, మ్యాగజైన్లు మిస్సింగ్ అయినట్లు తెలుస్తోంది. అయితే బుల్లెట్ల సంఖ్యపై భిన్నమైన వివరాలు వెలువడుతున్నాయి. కొన్ని నివేదికల్లో 2 వేలకు పైగా అని, మరికొన్ని వివరాల్లో 1,912 రౌండ్లు అని పేర్కొంటున్నారు. తుది సంఖ్యపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

అల్మారా తాళాలు పగలగొట్టి.. పెట్టెల ధ్వంసం..

ఆర్మీ ఆయుధాలు, మందుగుండు సామగ్రి నిల్వ చేసే గదిలోని అల్మారా తాళాలు పగలగొట్టినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించినట్లు సమాచారం. బుల్లెట్లు ఉంచిన పెట్టెలను కూడా ధ్వంసం చేసిన ఆనవాళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఇంతటి ఘటన జరిగినప్పటికీ సమీపంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఎలాంటి శబ్దాలు వినిపించకపోవడంపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఆ సమయంలో భారీ వర్షం కురవడంతో శబ్దాలు వినిపించలేదని సిబ్బంది చెప్పినట్లు సమాచారం.

160 డిటోనేటర్లతో మరింత కలకలం...

మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ క్యాంపు సమీపంలోని ఫైరింగ్ రేంజ్ వెనుక గోడ వద్ద ప్లాస్టిక్ బకెట్‌లో 8 బండిళ్లుగా ఉన్న 160 ఎలక్ట్రికల్ డిటోనేటర్లు లభించినట్లు సమాచారం. ఆర్మీ సిబ్బంది సమాచారం ఇవ్వడంతో బొల్లారం పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. బాంబు నిర్వీర్య బృందానికి కూడా సమాచారం అందించారు. డిటోనేటర్లను అక్కడికి ఎవరు తీసుకొచ్చారు? ఆయుధాల మిస్సింగ్‌కు వాటికి ఏమైనా సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. గుర్తుతెలియని వ్యక్తులపై పేలుడు పదార్థాల చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

తెల్లవారుజామున అనుమానాస్పద బైక్..

రెజిమెంట్‌కు వచ్చే అన్ని మార్గాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. క్యాంపు చుట్టుపక్కల ఉన్న ప్రైవేట్



కెమెరాల దృశ్యాలను కూడా సేకరిస్తున్నట్లు సమాచారం. దర్యాప్తులో భాగంగా ఓ ప్రైవేట్ సీసీ కెమెరాలో తెల్లవారుజామున 3.48 గంటల సమయంలో మిల్కాసింగ్ గ్రౌండ్ సమీపంలో ఓ బైక్ కనిపించినట్లు తెలుస్తోంది. వాహనం వేగంగా వచ్చి వెళ్లిపోవడంతో నంబర్ స్పష్టంగా కనిపించలేదని సమాచారం. ఆ బైక్‌కు ఆయుధాల మిస్సింగ్‌తో ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.

గోడ అవతలికి విసిరారా?

ఆయుధాల పరిమాణం, బరువును పరిగణనలోకి తీసుకుంటే వాటిని సాధారణంగా బయటకు తీసుకెళ్లడం అంత సులభం కాదని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయుధాలను ప్రహరీ గోడ అవతలికి విసిరి.. అక్కడి నుంచి తరలించారా? లేక రెజిమెంట్ పరిధిలోనే ఎక్కడైనా దాచి తర్వాత బయటకు తీసుకెళ్లారా? అనే రెండు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ప్రహరీ గోడలో బలహీనంగా ఉన్న ప్రాంతాలు, క్యాంపులోకి ప్రవేశించే మార్గాలు, గేట్ల వద్ద భద్రత, సిబ్బంది రాకపోకల వివరాలను సేకరిస్తున్నారు.

సిబ్బంది, హనీట్రాప్ కోణంలోనూ విచారణ..

ఆయుధాల గదికి ఎవరెవరికి ప్రవేశం ఉంది? ఆయుధాలు, మందుగుండు సామగ్రి రికార్డులను ఎవరు నిర్వహిస్తున్నారు? గత మూడు నెలల్లో నిల్వలను ఎప్పుడు తనిఖీ చేశారు? అనే అంశాలపై అధికారులు దృష్టి పెట్టారు. మద్రాస్ రెజిమెంట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. డాగ్ స్క్వాడ్ తనిఖీల్లో ఓ సిబ్బంది వద్ద కుక్క ఆగడంతో అతడిని అనుమానితుడిగా ప్రశ్నించినట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ.. అతడి పాత్రపై అధికారిక నిర్ధారణ లేదు. ప్రహరీ సమీపంలోని గడ్డిలో మ్యాగజైన్ లభించినట్లు కూడా తెలుస్తోంది.

గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. ప్రభుత్వ తీరుపై ఫిర్యాదు

హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో : తెలంగాణలో నెలకొన్న తాజా పరిస్థితులను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు వివరించినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. బుధవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు, కేసీఆర్ ఇంటి వద్ద కాంగ్రెస్ శ్రేణుల నిరసన తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరుపై ఫిర్యాదు...

అసెంబ్లీకి వెళ్తున్న సమయంలో నడిరోడ్డుపై తమను పోలీసులు అడ్డుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని విమర్శించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై పోలీసుల దాడికి సంబంధించిన దృశ్యాలను గవర్నర్‌కు చూపించినట్లు తెలిపారు.

సునీత చీర లాగారు..

ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను లాగి దుశ్శాసన పర్వం సృష్టించారని గవర్నర్‌కు వివరించినట్లు కేటీఆర్ చెప్పారు. రాహుల్ గాంధీ తరహాలోనే తాము నల్ల టీషర్టులు ధరించామని తెలిపారు. స్పీకర్ అంటే తమకు గౌరవం ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజలకే కాకుండా ప్రజాప్రతినిధులకు కూడా అవమానాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు.



కేసీఆర్ ఇంటి వద్ద 'చావు దప్పు'..

ముఖ్యమంత్రి ప్రేరేపించడం వల్లే మాజీ సీఎం కేసీఆర్ ఇంటి వద్దకు కాంగ్రెస్ శ్రేణులు వేల సంఖ్యలో చేరి చావు దప్పు కొట్టారని కేటీఆర్ ఆరోపించారు. ఈ అంశాన్ని కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

బయట జరిగిన ఘటనలపై విచారణ..

అసెంబ్లీ లోపల జరిగిన అంశాలపై తాను ఎలాంటి చర్యలు తీసుకోలేనని, అయితే అసెంబ్లీ బయట జరిగిన అన్ని ఘటనలపై విచారణ జరిపిస్తామని గవర్నర్ హామీ ఇచ్చినట్లు కేటీఆర్ వెల్లడించారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధుల హక్కులు, గౌరవాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు.

కేసీఆర్‌పై వ్యాఖ్యలు.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరణ

- **బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం..**
- **ఫ్లోలో అనేశాను.. కేసీఆర్‌ను గౌరవిస్తా..**
- **కేసీఆర్ చనిపోవాలని తాము కోరుకోవడం లేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టీకరణ.**



హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో : తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ వేడి మరింత పెరిగింది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపడంతో.. ఆయన తాజాగా వివరణ ఇచ్చారు.

ఫ్లోలో అనేశాను.. కేసీఆర్‌ను గౌరవిస్తాం..

తాను ఏదో ఫ్లోలో అలా అనేశానని వీర్లపల్లి శంకర్ తెలిపారు. కేసీఆర్‌ను తాము గౌరవిస్తామని, ఆయన అసెంబ్లీకి వస్తే తాము కూడా గౌరవిస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ చనిపోవాలని తాము నిజంగా కోరుకోవడం లేదని క్లారిటీ ఇచ్చారు.

దళితులు నడిచారని రోడ్డును శుద్ధి చేయడం దారుణం



హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :దళితులు నడిచిన రోడ్డును శుద్ధి చేయడం దారుణమైన ఘటన అని తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన ఆయన.. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, విద్యతో ప్రజల్లో చైతన్యం పెరిగినా కొందరి భావజాలం మాత్రం మారకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు.

'మనసులను శుద్ధి చేయాలి'..

భూతల్లిని శుద్ధి చేయాల్సిన అవసరం లేదని, అస్పృశ్యత భావజాలం నాటుకుపోయిన వారి మనసులను శుద్ధి చేయాలని మంత్రి శ్రీహరి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి అహంకారపూరిత వ్యక్తులను, ఆ భావజాలాన్ని ప్రజలు సహించరని అన్నారు.

మహిళా ఉద్యోగుల ఘటనపై ఆగ్రహం..

మహిళా ఉద్యోగుల ముందు దుస్తులు విప్పిన ఘటనను ప్రస్తావిస్తూ.. సభ్య సమాజం తలదించుకుంటోందని మంత్రి శ్రీహరి అన్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

కేసీఆర్‌కు సీఎం ఆహ్వానం...

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభకు వచ్చి సలహాలు, సూచనలు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నోసార్లు ఆహ్వానించారని వాకిటి శ్రీహరి తెలిపారు. సభలో ప్రతిపక్ష నేతల సూచనలు, సలహాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు.

హైటెక్ విధానాన్ని అమలు చేస్తున్నా గంజా బ్యాచ్

- కొత్త సప్లయ్ చైన్ ను కనుగొన్నా డ్రగ్స్ సప్లయర్స్
- రాపిడో బాయ్స్ తో నడిపిస్తున్నారు అని వినికిడి

ప్రజా వాయిస్ - రామక్రిష్ణపూర్



మంచిర్యాల జిల్లా లోని రామక్రిష్ణ పూర్ పట్టణం లో అధునాతన రీతిలో గంజాయిని తరలిస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడం జరిగింది. వివరాల్లోకి వెళితే రామక్రిష్ణ పూర్ పట్టణంలో ఇప్పటికే బెల్ట్ షాపుల దందా జోరుగా సాగుతున్న తరుణంలో గంజాయి డెలివరీ పార్టనర్స్ ని వినియోగించుకుని పట్టణంలో విచ్చలవిడిగా గంజాయిని సప్లై చేస్తున్నా రని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు. రాత్రిపూట 11 గంటలు దాటిన తర్వాత కాలనీ లోకి కొత్త వ్యక్తుల తిరుగుతున్నారని , కాలనీల చుట్టూ పక్కల ఒక రకమైన వాసన వస్తుందని పట్టన ప్రజలు వెల్ల డించారు. ఇది ఇలానే జరిగితే విద్యార్థుల భవిష్యత్తు సర్వ నాశనం అవుతుందని, మా కళ్ల ముందే పిల్లల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ హై టెక్ దందాలు గుట్టు రట్టు చేసి పిల్లల భవిష్యత్తును, అవాంచానియా సంఘటనలు, జరగక ముందే జాగ్రత్తగా ఉండాలని పట్టన ప్రజలు తెలియజేశారు. దీని మీద ప్రజా వాయిస్ టీం సదరు పట్టన ఎస్ ఐ శ్రీధర్ ని కాలువగా సానుకూలంగా స్పందించి, ప్రజా వాయిస్ టీంని మెచ్చుకోవడం జరిగింది. ఈ ఘటన పైన పూర్తి విచారణ జరిపి నిందితులను వదిలి పెట్టము , ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కాళోజి ప్రజాకవి.. తెలంగాణ భాషకు ప్రతీక

- "బడి పలుకుల భాషే కావాలి."
- వజ్జ తిరుపతి.మండల విద్యాశాఖాధికారి
- 'నా గొడవ'తో తెలంగాణ మాండలిక భాష సౌందర్యాన్ని ప్రపంచానికి చాటిన కాళోజి.

ప్రజా వాయిస్ ములుగు జిల్లా:/ ప్రజల కోసం తన కలాన్ని ఆయుధంగా మలచుకుని, తెలంగాణ భాషకు, యాసకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను తెలుగు భాషా వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజే శారు.తెలుగు భాషా వేదిక ములుగు జిల్లా అధ్యక్షుడు ఎం.డి. హమీద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్య క్రమానికి ములుగు మండల విద్యాశాఖ అధికారి వజ్జ తిరుపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "కాళోజి ప్రజాకవి.. బడి పలుకుల భాషే కావాలి"కాళోజి నారాయణరావు ప్రజల మనసుల్లో నిలిచిన ప్రజాకవి అని వజ్జ తిరుపతి అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సరళమైన, సహజమైన భాషను ఉపయోగించాలని సూచించారు. తెలుగు భాషను పరిరక్షించడంలో విద్యార్థుల పాత్ర కీలకమని తెలిపారు."తెలంగాణ మాండలిక భాషకు 'నా గొడవ' ప్రత్యేక గుర్తింపు తెచ్చింది" కాళోజి తన రచనల ద్వారా తెలంగాణ ప్రజల జీవన విధానాన్ని, యాసను, మాండలిక భాషలోని మాధుర్యాన్ని సాహిత్య ప్రపంచానికి పరిచయం చేశారని పేర్కొన్నారు. ముఖ్యంగా 'నా గొడవ' రచన తెలంగాణ మాండలిక భాషా సౌందర్యానికి అద్దం పట్టిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేసి అభినం దించారు. తెలుగు భాష, సాహిత్యంపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు భాషా వేదిక చేస్తున్న కార్యక్రమాలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో తెలుగు భాషా వేదిక ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు, గౌరవాధ్యక్షుడు ఎస్.ఎస్. శ్రీనివాసచార్య, ప్రధానోపాధ్యాయులు జి. రమేష్, పుష్ప, కె. కృష్ణమూర్తి, తాడిచెర్ల రవి, సంధ్యారాణి, మల్లయ్య, సునీత, రాజు యాదవ్, వెంకటేశ్వర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.a



గోదావరిఖనిలో తుది కూల్చివేత.. ఆపరేషన్ పోచమ్మ మైదాన్ పూర్తి!

- స్టే తొలగడంతో వివాదాస్పద భవనం నేలమట్టం
- భారీ పోలీసు బందోబస్తు మధ్య రంగంలోకి 3 ప్రొక్లెనర్లు
- సుందరీకరణ, మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణానికి మార్గం సుగమం

ప్రజా వాయిస్ గోదావరిఖని పారిశ్రామిక నగరమైన గోదావరిఖనిలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆపరేషన్ పోచమ్మ మైదాన్ ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. గతంలో అనుమతులు లేవనే నెపంతో సింగరేణి, రామగుండం నగరపాలక సంస్థ అధికారులు ఉమ్మడిగా ఇక్కడి అక్రమ నిర్మాణాలను కూల్చి వేసిన సంగతి తెలిసిందే. అయితే, ఒక భవంతి కూల్చివేతపై కోర్టు స్టే ఉండటంతో అప్పట్లో ఆ ఒక్క నిర్మాణాన్ని అధికారులు నిలిపివేశారు. తాజాగా ఆ ప్రతిబంధకాలు తొలగిపోవడంతో రామగుండం మున్సిపల్ అధికారులు బుధవారం ఉదయం మెరుపు దాడి చేపట్టారు. రామగుండం పోలీసుల భారీ బందోబస్తు నడుమ, ఏకకాలంలో మూడు ప్రొక్లెనర్లను (జేసీబీ) రంగంలోకి దించి వివాదాస్పద భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేశారు. ఈ తుది కూల్చివేతతో రీగల్ సెంటర్ నుంచి ప్రధాన చౌరస్తా వరకు ఉన్న రోడ్డు సుందరీకరణకు, నూతనంగా నిర్మించతలపెట్టిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌కు అడ్డుగా ఉన్న నిర్మాణాలన్నీ పూర్తిగా తొలగిపోయాయి. ఏళ్ల తరబడి ఆటంకంగా మారిన భవనం నేలమట్టం కావడంతో ఈ ప్రధాన రహదారి ప్రాంతం విశాలంగా మారింది. దీంతో వాహనదారులకు, స్థానికులకు నిత్యం ఎదురవుతున్న రాకపోకల ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

రోడ్డు వేసి ప్రాణాలు కాపాడండి!

- 15 ఏళ్లుగా గుంతల రోడ్డుతో కల్ ఖోడ ప్రజల నరకయాతన
- శిలాఫలకం దాటని రోడ్డు హామీ..
- వందలాది వాహనాల రాకపోకలు
- తక్షణమే కొత్త బీటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్
- రోడ్డు దుస్థితిపై ప్రజావాయిస్ దినపత్రికలో వరుస కథనాలు





ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో: వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని కల్ ఖోడ గ్రామానికి వెళ్లే రహదారి తీవ్రంగా దెబ్బతిని కనీసం నడవడానికి కూడా వీల్లేకుండా తయారయ్యింది. 15 ఏళ్ల కింద వేసిన బీటీ రోడ్డు కాలగమనంలో కొట్టుకుపోయి ప్రస్తుతం కేవలం గుంతలు, తేలిన కంకర రాళ్ళతో దర్శనమిస్తు న్నాయి. మండల కేంద్రం నుంచి గ్రామానికి చేరుకోవాలంటే ఈ రోడ్డు మార్గాన్నే చేరుకుంటారు. అంతేగాక వివిధ ప్రాంతాలకు వెళ్ళ వలసిన ప్రజలు ఈ రోడ్డు గుండనే నిత్యం రాకపోకలు కొనసాగి స్తారు. బంట్వారం మండలం తోర్మమిడి గ్రామానికి, మరియు తాండూరు నియోజకవర్గం లోని వివిధ గ్రామాలకు హైదరాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రం సరిహద్దులో గల కుంచారం, చించోలి వంటి ప్రాంతాలకు ఈ రోడ్డు మార్గమే అత్యంత సమీపం కావడంతో నిత్యం ఈ రోడ్డు గుండా వందలాది వాహనాలు రాకపోకలు సాగి స్తుంటారు. అంతేగాక నిత్యం కళాశాలలకు ,పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వివిధ వాణిజ్యకారులు ఈ రోడ్డు పై ప్రయాణించాలంటే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వాహనదారుల నరకయాతన

ఈ రహదారి దుస్థితి కారణంగా ఆయా మార్గంలో వేళ్ళే ద్విచక్రవా హనదారులు ప్రమాదాలకు గురవుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా రాత్రి వేళలో మరియు అత్యవసర సమయాల్లో ప్రయాణం నరకం ప్రాయంగా మారుతుంది కంకర రాళ్ళ పైకి లేవడం వల్ల వాహనాల టైర్లు పంక్చర్ అవ్వడమే గాక, అదుపుతప్పి కిందపడి గాయాలవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోలు ,కార్లు, ఆర్టీసీ బస్సులు సైతం ఈ రోడ్డుపై నడ పలేక తరచూ మరమ్మత్తులకు గురవుతున్నాయని , రహదారి దెబ్బ తినడంతో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను, ధాన్యాన్ని మార్కెట్లకు తరలించడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిలాఫలకం వేసి ఏండ్లు గడిచినా

రోడ్డు నిర్మాణానికి సంబంధించి శిలాఫలకం ఏర్పాటు చేసి సంవత్స రాలు గడిచిన నేటికీ రోడ్డుపై తట్టెడు మట్టి వేయి లేదు. రోడ్డు దుస్థితిపై స్థానిక రాజకీయ నాయకులు ఎన్నికల సందర్భంగా రోడ్డు బాగు చేస్తామని వాగ్దానాలు పలికి తీర అధికారంలోకి వచ్చాక ఇటువైపు కన్నెత్తి కూడా చూడట్లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే రోడ్డు నిర్మించాలని గుంతలమైన రోడ్ల తో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తక్షణమే నిధులు మంజూరు చేసి యుద్ధ ప్రతిపాదికన కొత్త బీటీ రోడ్డు నిర్మించాలని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ అధికారులను పాలకులను స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మంథనిలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేను విజయవంతం చేయాలి

- జాతీయ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ పిలుపు



ప్రజా వాయిస్ మంథనిజాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపడుతున్న పిరియా డిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్)-2026లో భాగంగా, మంథని పట్టణ ప్రజలు అధి కారులు సేకరించే సమాచారాన్ని అందించి సర్వేను విజయవంతం చేయాలని జాతీయ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ కోరారు. బుధవారం ఆయన మంథని ఆర్డీవో సురేష్, తహసీల్దార్ ఆరిఫోద్దిన్, ఎంపీడీవో శ్రీజ, మున్సిపల్ కమిషనర్ మనోహర్, మేనేజర్ శార దలను మర్యాదపూర్వకంగా కలిసి సర్వే కరపత్రా లను అందజేశారు. ఈ సందర్భంగా సర్వే లక్ష్యాలు, ప్రాముఖ్యతను వారికి వివరించారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... దేశంలో ఉపాధి, నిరుద్యోగిత, కార్మిక శక్తి భాగస్వామ్యం, స్వయం ఉపాధి వంటి కీలక అంశాలపై సరైన గణాంకాలను రూపొందించేం దుకే కేంద్ర ప్రభుత్వం ఈ సర్వేను నిర్వహిస్తోం దని తెలిపారు.

వివరాలు గోప్యంగా ఉంచుతాం

మొదటి దశలో ఎంపిక చేసిన కుటుంబాల సాధారణ వివరాలను నమోదు చేస్తామని, ఆ తర్వాత ప్రతి మూడు నెలల కాలంలో నెలకు ఒకసారి సందర్శించి మొబైల్ టాబ్ ద్వారా సమగ్ర సమాచారాన్ని సేకరి స్తామని వివరించారు. కుటుంబ సభ్యుల విద్యార్హ తలు, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలి, పని గంటలు, వేతనాలతో పాటు మహిళల ఆదాయ మార్గాలు, గిగ్ వర్కర్స్ (జొమాటో, స్విగ్గీ, రాపిడో, ఓలా, ఉబెర్ వంటి ప్లాట్‌ఫారమ్‌లలో పనిచేసేవారు) వివరాలను కూడా నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చే సమాచారాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, ఎలాంటి అపోహలు లేకుండా కచ్చితమైన వివరాలు అందించి సహకరిం చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంథని డివైస్ఓ వెంకటేశ్వర్లు, ఎంపీఎస్ఓ సంధ్యారాణి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలిమెలలో ప్రజల అవసరాలకు పెద్దపీట

- విద్యుత్ సౌకర్యాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి
- గ్రామ సర్పంచ్ జవ్వాజి పుష్పలత-తిరుపతి

ప్రజా వాయిస్, పలిమెల: గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలిమెల గ్రామపంచాయతీ పరిధిలో అదనపు విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు చేపట్టారు. ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను గుర్తించిన సర్పంచ్ జవ్వాజి పుష్పలత–తిరుపతి విద్యుత్ సిబ్బందితో సమన్వయం చేసుకుని అవసర మైన ప్రాంతాల్లో అదనపు స్తంభాలు వేయిస్తున్నారు. గ్రామంలో ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యం అందించడమే లక్ష్యంగా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.



ఫైనాన్స్ సంస్థ ఒత్తిడితో వ్యక్తి గుండెపోటుతో మృతి?

- ఈఎంఐ కట్టినా కంపెనీ వేధిస్తోందని ఆరోపణ?
- హౌసింగ్ లోన్ బకాయిల పేరిట అరెస్ట్ వారెంట్ జారీ చేయించారని ఆరోపణ
- పైనంపల్లిలో విషాదం.. విచారణ కోరుతున్న కుటుంబ సభ్యులు



ప్రజా వాయిస్ ఖమ్మం ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ నుంచి అరెస్ట్ వారెంట్ ఒత్తిడి రావడంతో తీవ్ర మనస్తాపా నికి గురై ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన మండల పరిధిలోని పైనంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం, పైనంపల్లి గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ 2024లో సూర్యాపేట కేంద్రంగా నడుస్తున్న ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ నుంచి సుమారు రూ. 8 లక్షల గృహ రుణం (హౌసింగ్ లోన్) తీసుకున్నారు. అయితే, రుణ వాయిదాల విషయంలో సదరు ఫైనాన్స్ సంస్థ కోర్టును ఆశ్రయించి అరెస్ట్ వారెంట్ జారీ చేయించి నట్లు సమాచారం. ఈ క్రమంలో సదరు వారెంట్‌కు సంబంధించి సమాచారం ఇచ్చేందుకు సోమవారం పోలీసులు మస్తాన్ ఇంటికి వెళ్లి స్టేషన్‌కు రావాల్సిం దిగా చెప్పినట్లు తెలిసింది. తమపై ఫైనాన్స్ కంపెనీ అరెస్ట్ వారెంట్ దాకా వ్యవహారాన్ని తీసుకురావ డంపై మస్తాన్ తండ్రి షేక్ హుస్సేన్ తీవ్ర దిగ్భ్రాంతికి, మనస్తాపానికి లోనయ్యారని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. అదే రోజు రాత్రి ఆయనకు తీవ్ర గుండెపోటు రావడంతో ప్రాణాలు విడిచినట్లు తెలిపారు.గత నెల ఆగస్టు 31న కూడా నిబంధనల ప్రకారం తాము వాయిదా (ఈఎంఐ) చెల్లించామని, అయినప్పటికీ ఫైనాన్స్ కంపెనీ ఉద్దేశ పూర్వకంగానే ఇంతటి తీవ్ర నిర్ణయానికి వెళ్లి వారెంట్లు జారీ చేయించిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. లోన్ కుమారుడి పేరిట ఉన్నప్ప టికీ, సంస్థ తీసుకున్న చర్యల వల్ల తండ్రి తీవ్ర మానసిక ఆందోళనకు గురై ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు ఫైనాన్స్ కంపెనీ పై నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ లో బాధితులు ఫిర్యాదు చేసారు. కంపెని వేదింపులు, వ్యవహారశైలిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తమకు జరిగిన అన్యాయానికి తగిన చర్యలు తీసుకో వాలని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు.

మంత్రి శ్రీధర్ బాబుపై చిల్లర వ్యాఖ్యలు మానుకో పుట్ట మధుకర్

- మంథని కాంగ్రెస్ నాయకులు హెచ్చరిక

ప్రజా వాయిస్ మంథని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆయన కుటుంబంపై బీఆర్ఎస్ నేత మధు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ అన్నారు. మంథని ప్రెస్ క్లబ్‌లో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సెగ్గం రాజేశం ఆధ్వర్యంలో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజలే తరిమికొడతారని హెచ్చరించారు. పదేళ్ల పాలనలో దళితుడిని సీఎం చేస్తామని, మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి బీఆర్ఎస్ మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు, 200 యూనిట్ల విద్యుత్ సహా 80 శాతం హామీలను అమలు చేసిందని గుర్తుచేశారు. అలాగే, దళిత వర్గానికి చెందిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అవమానించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలను తక్షణమే పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నిరసన తెలిపి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పెంటరి రాజు, నాయకులు వేల్పుల రాజయ్య, లింగయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



పినపాక గడ్డపై కాంగ్రెస్.. బిఆర్ఎస్ రాజకీయ రచ్చ..!

- కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రాజీనామా చెయ్యాలి అంటూ నిరసన తెలిపిన పాయం
- గతం మరిచి వ్యాఖ్యలు చెయ్యొద్దు అంటూ బిఆర్ఎస్ నేతల హెచ్చరిక
- దమ్ముటే ఆరు గ్యారెంటీలు అమలు చెయ్యండి అని సవాల్
- ప్రచారలు సరే చేసిన అభివృద్ధి ఏముందో ప్రజలకు చూపించడండి
- అనేక పదకాలు అమలు చేసినందుకు కేసీఆర్ రాజీనామా చేయాలా..!??
- గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చినందుకు రాజీనామా చేయాలా...!??
- సోషల్ మీడియా వేదికగా సూటిగా ప్రశ్నించిన రేగ కాంతారావు..





ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాభద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక రాజకీయం అంటేనే నేడు రాజకీయ రచ్చగా మారింది. ఆరు గ్యారంటీలు ఆశ చూపించిన కాంగ్రెస్ నేతలు. నేడు పదే పదే గత ప్రభుత్వ లోపాలు చూపించడం ప్రాజెక్టుల పేరుతో దోపిడీ జరిగింది అంటూ ప్రజలకు చెప్పడం తప్ప వెయ్యి రోజుల కాంగ్రెస్ పార్టీ పాలనలో ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని స్థితికి ప్రజా పాలన ప్రభుత్వం చేరింది అంటూ రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణ 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీలు అమలు తీరుపై అధికార పార్టీ కాంగ్రెస్ వర్సెస్ ప్రతిపక్ష పార్టీ బి ఆర్ ఎస్ మధ్య తీవ్రమైన రాజకీయ రచ్చ విమర్శలు తారస్థాయిలో కొనసాగుతున్నాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొన్ని హామీలను పాక్షికంగా ప్రారంభించినప్పటికీ పూర్తిస్థాయి పథకాలు అమలులో ఎదురవుతున్న జాప్యంపై. ప్రజల్లో మరియు రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు గడిచిన. వృద్ధులకు వితంతులకు మరియు ఇతరులకు అందించే నెలసరి పెన్షన్ 4,000 రూపాయలు ప్రతి నెల ఒకటో తారీకు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజులు గడిచిన పైసా ఇవ్వకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు అందించవలసిన ఐదు లక్షల విద్య భరోసా కార్డ్స్ మరియు మండలానికి అంతర్జాతీయ పాఠశాల, ఊసు లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్ప. కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ శుభకార్యాలకు తులం బంగారం, ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనలో ఈసం ఎత్తు బంగారం ఇవ్వలేదని మహిళలు పచ్చి బూతులు తిడుతున్నారు. 500 కి గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ పెద్దలు. వినియోగదారులకు తు, తు మంత్రం గానే సబ్సిడీ ఇస్తూ కాలయాపన చేస్తుందని మహిళలు ఆవేదన చెందుతున్నారు. దాంతో ప్రతిపక్ష పార్టీ గత పది రోజులుగా మాకు వద్దు రా నాయన రాక్షస పాలన అంటూ జోరుగా ప్రచారం చేయడంతో. జీర్ణించుకోలేని కాంగ్రెస్ పార్టీ పెద్దలు, మంత్రులు ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రాజీనామా చేయాలి అంటూ నిరసనలు తెలపడం గమనార్హం!

కల్వకుంట్ల చంద్రశేఖర రావు రాజీనామా చేయాలి అంటూ నిరసన తెలిపిన పాయం...

2012 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి పార్టీలో గెలిచిన పాయం వెంకటేశ్వర్లు పినపాక అభివృద్ధి పేరుతో టిఆర్ఎస్ పార్టీలో చేరడం ముసుపటి టిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుతో కలిసి పనిచేసిన పినపాక నియోజకవర్గ ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ అధినేత, ప్రతిపక్ష నేత, ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ వైఖరి పై వ్యతిరేకంగా జరుగుతున్న రాష్ట్రవ్యాప్త నిరసనల్లో భాగంగానే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తుంది. ప్రతిపక్షనేత హోదాలో ఉండి కూడా కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం లేదని పాయం వెంకటేశ్వర్లు మండిపడ్డారు. బాధ్యత యుతంగా సభకు వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడాలని లేనిపక్షంలో తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని పాయం వెంకటేశ్వర్లు ఆదివారం అంబేద్కర్ సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ గత వెయ్యి రోజులగా కెసిఆర్ అసెంబ్లీకి రాకుండానే జీతభత్యాలు, భద్రత తదితర వసతులు పేరిట కోట్ల రూపాయల ప్రజాధనం వృధా చేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడడంలో బిఆర్ఎస్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

గతం మరిచి వ్యాఖ్యలు చెయ్యొద్దు అంటూ బిఆర్ఎస్ కార్యకర్తల హెచ్చరిక

గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ ప్రజలకు అందించిన పథకాలు భారతదేశానికే ఆదర్శంగా నిలిచినాయని బిఆర్ఎస్ పార్టీ నేతలు కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు, గత ప్రభుత్వంలో కల్వకుంట్ల చంద్రశేఖర రావు చుట్టూ ప్రదర్శనలు చేసిన నువ్వు ఈరోజు కల్వకుంట్ల చంద్రశేఖర రావు రాజీనామా చేయాలని నిరసన తెలపడం. గురిగింజ తన కింద నలుపు ఎరగనట్టు నటించినట్లు కనిపించిందని బిఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత మరిచి మాట్లాడే ముందు కాంగ్రెస్ పార్టీలో గెలిచిన మీరు వెయ్యి రోజుల పాలనలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు. ప్రజలకు అందిన పథకాలు ప్రజలకు చూపించాలని సవాల్ చేశారు. దమ్ముంటే ఆరోగ్యారెంటీలు అమలు చేసి ప్రజల ముందుకు రావాలి అంటూ మండిపడ్డారు. ప్రజలకు పథకాలు అందించలేని ప్రభుత్వం పాలన పేరుతో చేసిన అప్పులు ఎక్కడ ఖర్చు చేస్తున్నారో చూపించాలని డిమాండ్ చేశారు. పాలనలో విఫలమైన మీరు కేసీఆర్ పై విమర్శలు చేయడం సరికాదు అన్నారు. దమ్ముంటే మహిళలకు 2,500.. రైతు భరోసా 7,000. వృద్ధులకు వికలాంగులకు ఒంటరి మహిళలకు తదితరులకు పెన్షన్ ఇచ్చిన మాట ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కల్యాణ లక్ష్మి షాది ముబారక్ శుభకార్యాలకు తులం బంగారం, తక్షణమే అమలు చేయాలి అంటూ వారు డిమాండ్ చేశారు...

సోషల్ మీడియా వేదికగా స్థానిక ఎమ్మెల్యే కు చురకలు వేసిన రేగ కాంతారావు

విదేశీ పర్యటనలు బిజీగా ఉన్న రేగ కాంతారావు పాయం వెంకటేశ్వర్ల చేసిన విమర్శలకు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. కల్వకుంట చంద్రశేఖర రావు ఎందుకు రాజీనామా చేయాలి అంటూ సూటిగా ప్రశ్నించారు. దళిత బంధు పథకం ప్రకారం దళితులకు 10 లక్షలు ఇచ్చినందుకు కేసీఆర్ రాజీనామా చేయాలా!? ఏజెన్సీ గిరిజనులకు ఫారెస్ట్ పోడు భూములు పట్టా ఇచ్చినందుకు కేసీఆర్ రాజీనామా చేయాలా!? కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం తెచ్చినందుకు కేసీఆర్ రాజీనామా చేయాలా!? తాగునీటి ప్రాజెక్టులు నిర్మించినందుకు కేసీఆర్ రాజీనామా చేయాలా!? విద్యార్థులకు అంబేద్కర్ పూలే ఓవర్సీస్ స్కాలర్షిప్ ఇచ్చినందుకు రాజీనామా చేయాలా!? తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు 24 గంటల కరెంటు ఉచితంగా ఇచ్చినందుకు రాజీనామా చేయాలా!? తెలంగాణ గడ్డపై కోటి ఎకరాలకు సాగునీరు అందించినందుకు కేసీఆర్ రాజీనామా చేయాలా!? ప్రతి నియోజకవర్గానికి 100 పడకల హాస్పిటల్ నిర్మించినందుకు కేసీఆర్ రాజీనామా చేయాలా!? ప్రతి జిల్లాకు కలెక్టరేట్ నిర్మించినందుకు కేసీఆర్ రాజీనామా చేయాలా!? ప్రతి నియోజకవర్గానికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నిర్మించినందుకు రాజీనామా చేయాలా!? అంటూ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నేతల మాటలు చూసి ప్రజలు నవ్వుతున్నట్లు రేగా కాంతారావు సోషల్ మీడియా వేదికగా తెలిపినారు. ప్రతిపక్షాల పై విమర్శలు బందు పెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని రేగ కాంతారావు స్పష్టం చేశారు..



అక్రమ ఇసుక రవాణాపై కోహెడ పోలీసుల ఉక్కుపాదం

- బొలెరో వాహనం సీజ్, వ్యక్తిపై కేసు నమోదు

ప్రజా వాయిస్ కోహెడసిద్దిపేట జిల్లా కోహెడ మండలంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. రామంచ గ్రామం నుంచి కోహెడ మీదుగా సిద్దిపేటకు బొలెరో వాహనంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో కోహెడ పోలీసులు నిఘా ఉంచారు. ఈ క్రమంలో కోహెడ గ్రామ శివారులో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న బొలెరో వాహనాన్ని (TG02-T-4931) పోలీసులు స్వాధీనం చేసుకుని, స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ ఘటనకు సంబంధించి నవాబ్‌పేట, చిన్నగురుమామిడి ప్రాంతానికి చెందిన జెట్టి అజయ్ సాగర్ (28) అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా కోహెడ ఎస్ఐ పి. అభిలాష్ మాట్లాడుతూ, మండల పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేసినా, నిల్వ ఉంచినా లేదా విక్రయాలకు పాల్పడినా చట్టప్రకారం అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే వారిపై క్రిమినల్ కేసులతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రాంతంలో అక్రమ ఇసుక దందాను అరికట్టేందుకు నిరంతరం నిఘా ఉంచుతూ, తనిఖీలను మరింత తీవ్రతరం చేస్తామని తెలిపారు.

వందేళ్ల చరిత్రను బలిపెట్టిన వైనం

- అనుమతి లేకుండా చెట్టు కొట్టేస్తే రూ.45 వేల జరిమానా!

ప్రజా వాయిస్ /చెన్నూరు వందేళ్లకు పైగా చరిత్ర కలిగి, పర్యావరణానికి జీవనాడిలా ఉన్న ఒక పురాతన రావి చెట్టును ఎలాంటి అనుమతులు లేకుండా నరికివేసిన ఘటనపై అటవీ శాఖ అధికారులు తీవ్రంగా స్పందించారు. సుమారు 300 ఏళ్ల చరిత్ర కలిగిన ఆ చెట్టును నేలకూల్చిన వ్యక్తికి భారీ జరిమానా విధించి, చట్టపరమైన హెచ్చరిక జారీ చేశారు.స్థానిక వివరాల ప్రకారం, చెన్నూరు ప్రాంతానికి చెందిన గోపాలకృష్ణ అనే వ్యక్తి తన నూతన గృహ నిర్మాణాన్ని చేపడుతున్నాడు. అయితే, ఆ నిర్మాణానికి దాదాపు మూడు వందల సంవత్సరాల వయస్సున్న ఒక పెద్ద రావి చెట్టు అడ్డుగా ఉందన్నకారంతో.. అతను ఎటువంటి శాఖాపరమైన అనుమతులు తీసుకోకుండానే దాన్ని రహస్యంగా నరికివేశాడు.వారసత్వంగా వస్తున్న పవిత్ర వృక్షం, మరియు పర్యావరణానికి ఎంతో ప్రాణాధారమైన చెట్టును తొలగించడంపై స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కొందరు బాధ్యులైన వ్యక్తులు ఈ తతంగాన్ని అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే విచారణ మొదలైంది.ఈ ఉదంతంపై డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (DCF) రామ్మూర్తి మీడియాతో మాట్లాడుతూ.. "అటవీ మరియు వృక్ష సంపద చట్టాల ప్రకారం ప్రభుత్వ లేదా ప్రైవేట్ స్థలాలలో ఉన్న పురాతన చెట్లను తొలగించాలంటే ముందస్తుగా విభాగా అనుమతి తప్పనిసరి. గోపాలకృష్ణ ఎలాంటి అనుమతులు పొందకుండానే స్వార్థ ప్రయోజనాల కోసం చెట్టును నరికివేశాడు. అందిన ఫిర్యాదుల ఆధారంగా మా సిబ్బంది తక్షణ విచారణ జరిపి, నిబంధనలను ఉల్లంఘించినందుకు నిందితుడికి రూ. 45,920 జరిమానా విధించడం జరిగింది," అని స్పష్టం చేశారు.పర్యావరణాన్ని ధ్వంసం చేసేవారిపై, అనుమతి లేకుండా చెట్లను నరికివేసే వారిపై చట్టపరమైన చర్యలు కఠినంగా ఉంటాయని ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.





ఆధునిక సాగుతో అధిక దిగుబడులు సాధించాలి

- టేకులపల్లిలో ఏటీఎంఏ శిక్షణ కార్యక్రమం

ప్రజావాయిస్/మొమిన్‌పేట్: టేకులపల్లి రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏటీఎంఏ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సిఫారసు చేసిన వరి రకాల సాగు, సహజ వ్యవసాయం, నానో ఎరువుల వినియోగం, నూనెగింజల పంటలు, సమగ్ర వ్యవసాయం, ఎరువుల సమతుల్య వినియోగం, మార్కెట్ ఆధారిత సాగు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందవచ్చని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని సూచించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, ఉపసర్పంచ్, ఏఈఓలు పెంటయ్య, స్వాతితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



కార్మికుల సంక్షేమమే లక్ష్యం


- అజ్మీరా రతన్.ములుగు జిల్లా బీజేపీ లేబర్ సెల్ కన్వీనర్ గా అజ్మీరా రతన్ నియామకం
- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి కార్మికుడికి చేరేలా కృషి

.ప్రజా వాయిస్ హైదరాబాద్, సెప్టెంబర్ 9:/ భారతీయ జనతా పార్టీ ములుగు జిల్లా కార్మిక విభాగం జిల్లా కన్వీనర్‌గా అజ్మీరా రతన్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర లేబర్ సెల్ కన్వీనర్ అందే శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అజ్మీరా రతన్ మాట్లాడుతూ..... తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన అందే శ్రీనివాస్, ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భూక్యా జవహర్‌లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి లమంతుల రవీంద్రాచారి, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.ములుగు జిల్లాలోని అసంఘటిత, ఇతర రంగాల కార్మికులను సంఘటితం చేసి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక సంక్షేమ పథకాలపై గ్రామస్థాయి వరకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి కార్మికుడికి వాటి ప్రయోజనాలు అందేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్మికులకు సామాజిక భద్రత, బీమా, పెన్షన్, ఆరోగ్య రక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలకు సంబంధించిన పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్మికుడికి అండగా నిలుస్తూ ములుగు జిల్లాలో బీజేపీ కార్మిక విభాగాన్ని బలోపేతం చేస్తానని అజ్మీరా రతన్ పేర్కొన్నారు.

మూడేళ్లుగా ఉంటున్నాం.. ఇప్పుడు ఇళ్లు లాక్కుంటారా?

- 2023లో అర్హుల ఎంపిక
- గ్రామపంచాయతీ తీర్మానంతో కేటాయింపు
- ఇంటి నంబర్లు ఇచ్చి.. గృహప్రవేశం చేసిన తర్వాత మళ్లీ లక్కీ డ్రా ప్రకటన
- కొంత సొంత డబ్బులతో ఇళ్లను పూర్తి చేసుకున్నామని బాధితుల ఆవేదన
- కలెక్టర్ , ఎమ్మెల్యే స్పందించి తమ ఇళ్లను తమకే ఇవ్వాలని వేడుకోలు





ప్రజా వాయిస్/కొడకండ్ల (జనగామ సెప్టెంబర్ 09)జనగామ జిల్లా కొడకండ్ల గ్రామపంచాయతీ పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుపై వివాదం నెలకొంది. 2023లో అప్పటి ప్రభుత్వం అర్హులైన పేదలను గుర్తించి గ్రామపంచాయతీలో తీర్మానం చేయడంతో పాటు సంబంధిత అధికారుల సమక్షంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించినట్లు లబ్ధిదారులు తెలిపారు. అప్పటి సర్పంచ్, ఉపసర్పంచ్, జెడ్పీ సీఈవో, కొడకండ్ల తహసీల్దార్, అప్పటి జిల్లా కలెక్టర్ సమక్షంలో ఇళ్ల కేటాయింపు జరిగిందని పేర్కొన్నారు. అనంతరం గ్రామపంచాయతీ నుంచి ఇంటి నంబర్లు కూడా కేటాయించినట్లు చెప్పారు.గత మూడు సంవత్సరాలుగా తాము అదే డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివసిస్తున్నామని బాధితులు తెలిపారు. కొన్ని ఇళ్లు పూర్తిగా నిర్మాణం కాకపోవడంతో తామే సొంత డబ్బులు వెచ్చించి అవసరమైన పనులు పూర్తి చేసుకున్నామని చెప్పారు. ఈ పరిస్థితుల్లో నాలుగు రోజుల క్రితం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మళ్లీ లక్కీ డ్రా ద్వారా ఇతరులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించనున్నట్లు ప్రకటించడంతో ఆందోళనకు గురైనట్లు తెలిపారు.దీంతో బాధితులు బుధవారం డబుల్ బెడ్ రూమ్స్ వద్ద ఆందోళన చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు. కొంతమంది వ్యక్తులు కలెక్టర్‌కు తప్పుడు సమాచారం అందించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని తమకు తెలిసిందని బాధితులు ఆరోపించారు. అయితే తమకు అధికారికంగా ఏ విధమైన విచారణ జరిగిందో, గతంలో కేటాయించిన ఇళ్లను తిరిగి ఎందుకు లక్కీ డ్రా ద్వారా కేటాయిస్తున్నారో అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మాకు గుంట భూమి కూడా లేదు..

తాము నిరుపేదలమని, తమకు గుంట భూమి కూడా లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గతంలో అర్హులుగా గుర్తించి ఇళ్ల కేటాయించి, ఇంటి నంబర్లు కూడా ఇచ్చిన తర్వాత ఇప్పుడు తమ ఇళ్లను ఇతరులకు కేటాయిస్తే తాము ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. తమ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని జనగామ జిల్లా కలెక్టర్, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలని చేతులెత్తి వేడుకున్నారు. గతంలో జరిగిన కేటాయింపులు, ప్రస్తుత లక్కీ డ్రా ప్రకటనపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన తమకు ఇళ్లపై హక్కు కల్పించాలని కోరారు.

వివక్షత , అసమానతలు , పేదరిక నిర్మూలనకై ఉద్యమిస్తాం

- మాకు రాజకీయంగా శాశ్వత మిత్రులు లేరు,శాశ్వత శత్రువులు లేరు
- అక్టోబర్ 7 న అమరావతి లో 1200 మండల కమిటీల జాతీయ సదస్సు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ



ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి శతాబ్దాల తరబడి భారతీయ సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల, వర్గ, మత,లింగ, వివక్ష తలను నిర్మూలించడం కోసం అలాగే సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతలను తొలగించడానికై మరియు పేదరిక నిర్మూలన కోసం ఎమ్మార్పీఎస్ అధ్వర్యంలో భవిష్యత్తు పోరాటాలు చేపడతా మని ఎమ్మార్పీ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు.హన్మ కొండ జిల్లాలో మడికొండ లోని సత్యసాయి కన్వెన్షన్ హాల్ లో ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి జాతీయ సదస్సు జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ పాల్గొన్నారు.ముందుగా మంద కృష్ణ మాదిగ కి గజమల వేసి నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.అనంతరం సభ ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు.అనంతరం జాతీయ సదస్సును ఉద్దేశించి మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ " ఎస్సీ వర్గీకరణ కోసం చిన్న గ్రామంలో మొదలైన ఉద్యమం దేశాన్ని కదలించిందని అన్నారు.ముప్పై ఏళ్ల సుదీర్ఘ పోరాటం తరువాత ఉద్యమం విజయం సాధించిందని అన్నారు.ఫలితంగా నేడు తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు జరుగుతుందని అన్నారు.ఎస్సీ వర్గీకరణ ఫలితాలు ఇప్పుడిప్పుడే జాతికి అందుతూ విద్యా ఉద్యోగ రంగాల్లో ముందుకు సాగుతున్నామని అన్నారు.అయితే ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమం కొనసాగించినప్పటికి సమాజ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఆరోగ్యశ్రీ పథకం, వికలాంగులు వృద్దులు వితంతువుల కోసం పోరాడి వారి పెన్షన్ పెంచడానికి తోడ్పడి వారి జీవితాల్లో వెలుగులు తీసుకురావడం జరిగిందని అన్నారు.ఇకపై సమాజ ప్రయోజనాల కోసం విస్తృతంగా పోరాటం చేస్తామని అన్నారు దేశంలో కుల వివక్షత తీవ్రంగా కొన సాగుతుందని అన్నారు.దళితులు ఉన్నత స్థాయిలోకి ఎదిగిన కూడా కులవివక్షతకు,అవమానాలకు గురి కాబడుతున్నారని అన్నారు.అం దువల్లనే సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ దళితుడైన బి ఆర్ గవాయి మీద బుట్లు విసిరి దాడి చేశారని అన్నారు.అలాగే ఇటీవల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు దళితుడైన మల్లికార్జున ఖర్గే ఉత్తరాఖండ్ లో సభ పెట్టే ప్రసంగిస్తే కొంత కుల ఉన్మాదులు ఆ సభ ప్రాంగణాన్ని పాలతో శుద్ధి చేశారు.ఇది ఘోరమైన అవమానం అని అన్నారు.అలాగే నిన్న తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ గారిని ఉద్దేశించి కుల దురంహకర ఎం ఎల్ సి ఘోరమైన పదం వాడి అవమనించాడని అన్నారు. ఇలాంటివి సహించరానివి అని అన్నారు.అందువల్ల దేశంలో కుల వివక్షత నిర్మూలన జరగాలని అన్నారు.కుల వ్యవస్థ రద్దు కావాలని అన్నారు.అందుకోసం భవిష్యత్తులో జాతీయ స్థాయిలో ఉద్యమం చేపడతామని అన్నారు.అలాగే మత పరమైన విద్వేషాలు తొలగి పోవాలని , లింగ వివక్షత, వర్గ వివక్షత నిర్మూలం కావాలని అన్నారు.అలాగే పేదరికం తొలగిపోవాలని నేటికీ సమస్య తీవ్రంగా ఉందని అన్నారు.సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతలు తొలగిపోవాలని అన్నారు.మహనీయులు గౌతమ బుద్ధుడు నుండి మొదలుకొని అంబేద్కర్ వరకు మహనీ యులు కలలు కన్న నూతన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఉద్యమాన్ని ముందుకు కొనసాగిస్తామని అన్నారు.అందులో భాగంగా అక్టోబర్ 7 న అమరావతిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన 1200 మండలాల నూతన ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి కమిటీల జాతీయ సదస్సు నిర్వహించి ప్రతక్ష్య పోరాటాలకు సిద్ధం అవుతా మని అన్నారు.

జ్యోతిబా పూలే గురుకులంలో విద్యార్థి మృతి!

- డ్రిల్ చేస్తుండగా కుప్పకూలిన ఎనిమిదో తరగతి బాలుడు
- బాలుని మృతిపై అనుమానాలు?
- ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన





ప్రజా వాయిస్ ఖమ్మం: ఖమ్మం జిల్లా, రఘునాథపాలెం మండల పరిధిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పాఠశాల మైదానంలో ఆటలాడుతూ ఎనిమిదో తరగతి విద్యార్థి ఒకరు ఆక స్మికంగా కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తుండగా, విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరపాలని కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.స్థానికులు, పాఠశాల వర్గాల కథనం ప్రకారం.. తిరుమలాయపాలెం మండలం కాకర వాయి గ్రామానికి చెందిన సాత్విక్ (14) రఘునాథ పాలెం గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదు వుతున్నాడు. బుధవారం ఉదయం పాఠశాలలో రోజు వారీగా నిర్వహించే శారీరక వ్యాయామం చేస్తుండగా, సాత్విక్ ఒక్కసారిగా సొమ్మసిల్లి కిందపడిపోయాడని. గమనించిన పాఠశాల సిబ్బంది వెంటనే స్పందించి చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.సాత్విక్ మరణ వార్త తెలియగానే కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆరోగ్యంగా ఉన్న బాలుడు ఉన్నట్టుండి ప్రాణాలు కోల్పోవడంపై తమకు అనుమానాలు ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, సమాచారం అందుకున్న విద్యార్థి సంఘాల నాయకులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల వరుస మరణాలు ఆందోళన కలిగిస్తు న్నాయని, ప్రభుత్వ పర్యవేక్షణ లోపించిందని వారు ఆరోపించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, బాధ్యులపై విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించిన అనంతరం మృతికి గల ఖచ్చిత మైన కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.





వరుస చోరీలకు చెక్..- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్!

- రూ.26 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- 35 తులాల బంగారం రికవరీ
- పగటిపూట రెక్కీ, రాత్రిళ్లు చోరీలు
- సిసిఎస్, స్థానిక పోలీసులకు అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా అభినందనలు

ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో: వికారాబాద్ జిల్లాలో వరుస గృహ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి సుమారు 35 తులాల బంగారంతో పాటు బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.26 లక్షలు ఉంటుందని అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా తెలిపారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా కేసు వివరాలను వెల్లడించారు. వికారాబాద్ టౌన్, తాండూర్, పరిగి తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని నిందితులు చోరీలకు పాల్పడుతు న్నట్లు తెలిపారు.

పగటిపూట రెక్కీ.. రాత్రిళ్లు చోరీ

నిందితులు పగటిపూట ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రెక్కీ నిర్వహించేవారని పోలీసులు తెలిపారు. అనంతరం రాత్రి వేళల్లో తాళాలు పగలగొట్టి ఇళ్లలోకి ప్రవేశించి నగదు, బంగారు, వెండి ఆభరణాలను అపహరించేవారని విచార ణలో వెల్లడైనట్లు తెలిపారు.ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు దొంగల ముఠా కదలికలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు 35 తులాల బంగారంతో పాటు ఇతర ఆభర ణాలను స్వాధీనం చేసుకున్నారు.పోలీసు బృందాలకు అభినందన లుకేసును స్వల్ప వ్యవధిలోనే ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు చోరీ సొత్తును రికవరీ చేసిన క్రైమ్ ఇన్వెస్టిగేషన్, స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బందిని అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా మాట్లాడుతూ.. ప్రజలు ఎక్కువ రోజుల పాటు ఇళ్లకు దూరంగా వెళ్లాల్సి వచ్చినప్పుడు ముందుగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఇళ్ల వద్ద నాణ్యమైన సీసీ కెమెరాలు, సెక్యూరిటీ లాక్స్ ఏర్పాటు చేసుకోవాలని, అనుమానా స్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అప్పాయిపల్లిలో యూరియా కోసం రైతుల అవస్థలు

- ఫోన్ చేతిలోనే.. టోకెన్ కోసం రాత్రంతా జాగారం

ప్రజా వాయిస్ దౌల్తాబాద్ యూరియా కోసం రైతుల ఎదురుచూపులు తప్పడం లేదు. పంటలకు ఎరువు వేయాల్సిన సమయంలో యూరియా కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆన్‌లైన్‌లో టోకెన్ కోసం ఎప్పుడు అవకాశం వస్తుందో తెలియక రైతులు రాత్రి వేళల్లోనూ ఫోన్ చేతిలో పెట్టుకుని ఎదురుచూస్తు న్నారు.యూరియా కోసం సొసైటీకి వెళ్లినా సరిపడా ఎరువు లభిస్తుందో లేదో తెలియని పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. దీంతో ఇంటి వద్ద ఉన్నప్పటికీ ఫోన్‌లో టోకెన్ కోసం వెతుకుతూ కాలం గడుపుతు న్నారు. ఒకవైపు పంటలకు యూరియా అవసరం పెరుగుతుండగా.. మరోవైపు దాని కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.


పంటపై శ్రద్ధ పెట్టాల్సిన వేళ..

పంటల సాగు పనుల్లో నిమగ్నం కావాల్సిన రైతులు యూరియా కోసం టోకెన్ ఎప్పుడు వస్తుందా అని ఎదు రుచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా సరఫరా సక్రమంగా జరిగితేనే పంటలకు సకాలంలో ఎరువు వేసే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.యూరియా కోసం రాత్రంతా ఫోన్ పట్టుకుని ఎదురుచూడాల్సి వస్తోంది. ఆన్‌లైన్‌లో టోకెన్ వస్తుందా? ఫర్టిలైజర్లలో యూరియా దొరుకుతుందా? అనే ఆందోళనతోనే సమయం గడుస్తోంది. ఇది కేవలం ఒక ఫొటో కాదు.. యూరియా కోసం రైతులు పడుతున్న కష్టానికి నిదర్శనం అని అప్పాయిపల్లి రైతు కేశబోయిన ప్రభాకర్ పేర్కొన్నారు.రైతుల అవసరాలకు అనుగు ణంగా యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని, ఆన్‌లైన్ టోకెన్ విధానంలో ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



తెలంగాణ ప్రజల గొంతుక ప్రజాకవి కాళోజీకి జయంతి నివాళులు

- తెలంగాణ మాటకు పండుగ రోజు
- తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు!



ప్రజా వాయిస్,హుజూర్ నగర్ , సెప్టెంబర్ 9:ప్ర జాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నేడు తెలంగాణ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 9ను కాళోజీ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిం చడం ఆనవాయితీగా కొనసాగుతోంది. తెలంగాణ భాష, యాస, సంస్కృతి, ప్రజల జీవన విధానానికి కాళోజీ తన సాహిత్యం ద్వారా ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారు. సామాన్యుడి మాటనే తన కవిత్వానికి ఆయుధంగా చేసుకుని, ప్రజల సమస్యలను నిర్భయంగా ప్రశ్నించిన ఆయన ప్రజాకవిగా చెరగని ముద్ర వేశారు. అన్యాయాన్ని ఎదిరిం చడమే తన ధ్యేయమని ప్రకటిస్తూ తన కలాన్ని ప్రజల పక్షాన నిలిపారు. అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి...అంటూ కాళోజీ పలికిన మాటలు నేటికీ ప్రజల్లో చైతన్యాన్ని నింపుతున్నాయి. పుట్టుక నీది..చావు నీది బతుకంతా దేశానిది అంటూ వ్యక్తి జీవితానికి సమాజం, దేశం పట్ల ఉన్న బాధ్యతను గుర్తుచే శారు. తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం కాళోజీ చేసిన పోరాటం ఆయన సాహిత్యంతో విడదీ యలేనిది.తెలంగాణ యాసను తక్కువగా చూడకుండా, అదే యాసలో ప్రజల బాధను, ఆకాంక్షను, ఆగ్రహాన్ని అక్షరబద్ధం చేశారు. అందుకే ఆయన రచనలు కేవలం సాహిత్యం కాకుండా ఒక కాలం ప్రజల గొంతుకగా నిలిచాయి. ప్రాంతీయ దోపిడీ, అన్యాయం, అణచివేతలపై ఆయన రాసిన పద్యాలు ప్రజల్లో ప్రశ్నించే ధైర్యాన్ని నింపాయి. ప్రజల కోసం నిలబడటం, అన్యాయాన్ని ప్రశ్నించడం, సమాజం పట్ల బాధ్యతగా జీవించడం అనే సందేశాన్ని తన జీవితంతోనే ఆచరించి చూపారు. కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం ద్వారా ఆయన సాహిత్య వారసత్వంతో పాటు తెలంగాణ భాష, యాస, సంస్కృతిని గౌరవిం చుకుంటున్నామని పలువురు సాహితీవేత్తలు పేర్కొంటున్నారు. కాళోజీ కలం చూపిన బాటలో తెలంగాణ భాషను కాపాడుకోవడం.. తెలంగాణ యాసకు గౌరవం ఇవ్వడం.. అన్యాయాన్ని ప్రశ్నించడం.. ప్రజల పక్షాన నిల బడటమే ఆయనకు అందించే నిజమైన నివాళి.

ఈత కల్లు దొంగతనాలకు అడ్డుకట్ట వేయాలి

- వన్నిగుడలో కొత్తగా గీసిన ఈత కల్లు రాత్రికి రాత్రే మాయం చేస్తున్న కేటుగాళ్ళు
- కల్లుగీత (గౌడ) కార్మికుల ఆవేదన చెందుతున్న యాదయ్య గౌడ్, వెంకటేష్ గౌడ్.
- అధికారులు దృష్టి సారించి గౌడ న్నలకు భరోసా కల్పించాలని కోరుతున్నారు.

ప్రజావాయిస్, కీసర : మేడ్చల్ జిల్లా కీసర అనుబంధ గ్రామం వన్నిగూడ గ్రామంలో ని వ్యవసాయ పొలాలలో కల్లుగీత గౌడకార్మికులు కొత్తగా (ఈదులు) ఈత చెట్లు గీసి కల్లు సేకరిస్తు, జీవనోపాధి పొందుతు న్నారు. గౌడన్నలు రోజులాగే సాయంత్రం ఈదులను గీసి, చెట్లుకు కుండలు కట్టి ఇంటికివెళ్తున్నారు. ఈతకల్లుపై కన్నేసిన కొందరు దుర్మార్గులు రాత్రివేళ ఈతచెట్ల వద్దకు వెళ్లి గీసిన కల్లును దొంగత నంగా తీసుకెళ్తున్నరని గౌడ కార్మికులు ఆవేదన వ్యక్తం చేసారు. రోజంతా కష్టపడి చెట్లను గీసి సాయంత్రం ఇంటికి వెళ్లిన అనంతరం, రాత్రి సమయంలో దొంగలు వచ్చి కల్లును ఎత్తుకెళ్తున్నారని, దీంతో తమ శ్రమకు ఫలితం లేకుండా పోతోందని గౌడన్నలు వాపో తున్నారు. ప్రతిరోజూ ఉదయం అక్కడికి వెళ్లిచూస్తే కల్లు కనిపించకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నామని తెలిపారు. ప్రాణాలు పణంగా పెట్టి ఈదులను గీసి స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన కల్లును అందిస్తున్న తమకు ఇలా జరగడం చాలా బాధాకరం అని అన్నారు.తమ జీవనోపాధికి గండికొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గౌడన్నలు కోరు తున్నారు. దొంగతనాలను అరికట్టేందుకు అధి కారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని గౌడ కార్మికులు కోరుతున్నారు. ఇకపై ఇలాంటి దొంగతనాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరి స్తామని గీత కార్మికులు హెచ్చరించారు. ఈ రోజు నుంచి రాత్రివేళ ఈత చెట్ల వద్ద నిఘా పెంచి, గస్తీ నిర్వహిస్తామని , కల్లు దొంగతనా లకు పాల్పడుతున్న వారిని పట్టుకునేందుకు కఠిన చర్యలు చేపడతామని గౌడ కార్మికులు స్పష్టం చేశారు. స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన కల్లును అందిస్తున్న గౌడన్నలకు ఇలా జరగడం బాధాకరం అన్న వన్నిగుడ గ్రామస్థులు. భవి ష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండ, కల్లు దొంగతనానికి పాల్పడుతున్న వారు ఎంతటి వారైనా వదిలేదిలేదన్నారు. రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహించి గౌడన్నల కష్టానికి తోడుగా ఉంటామని పేర్కొన్నారు.



శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- రౌడీ షీటర్లకు నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి హెచ్చరిక..

ప్రజా వాయిస్ /నల్గొండ క్రైమ్: నల్గొండ పట్టణంతో పాటు సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలను కాపాడేం దుకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి తెలిపారు.రాబోయే వినాయక నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో నల్గొండ సబ్ డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్లకు బుధవారం సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్గొండ టౌన్ పరిధి లోని 75 మంది రౌడీ షీటర్లతో పాటు సబ్ డివిజన్ పరిధిలోని మొత్తం 150 మంది రౌడీ షీటర్లు హాజర య్యారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గతంలో నేరాలకు పాల్పడిన వారు తమ నేర ప్రవృత్తిని పూర్తిగా విడిచిపెట్టి ఇకపై ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా సాధారణ పౌరులుగా ప్రశాంతంగా జీవించాలని సూచించారు.వినాయక ఉత్సవాల సమయంలో ఎలాంటి గొడవలు, అల్లర్లు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా, శాంతిభ ద్రతలకు విఘాతం కలిగించినా, గొడవల్లో జోక్యం చేసుకున్నా లేదా నేరాలకు పాల్పడినా పీడీ యాక్ట్ (PD Act)తో పాటు కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.రౌడీ షీటర్ల కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారని వారి ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని తెలిపారు. నేరాలకు దూరంగా ఉంటూ మంచి మార్గంలో నడుచుకుని కుటుంబంతో కలిసి గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని సూచించారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యనైనా పోలీసులు సహించబోరని డీఎస్పీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నల్గొండ వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి, ఎస్ఐలు సైదాబాబు, శివప్రసాద్, ముత్తయ్య, పోలీస్ సిబ్బంది షకీల్, శంకర్, అంజయ్య, బాలకోటి తదితరులు పాల్గొన్నారు....





రక్షించాల్సిన వారే భక్షించారా?

- పంచాయతీ కార్యదర్శిపై చట్టపరమైన చర్యలకు డిమాండ్

ప్రజా వాయిస్: చిన్న కోడూర్ సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలం పరిధిలోని చెర్ల అంక రెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 'హరితహారం' చెట్లను నరికివేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ విషయమై గ్రామానికి చెందిన చింతల రాజు అనే వ్యక్తి సిద్దిపేట ఫారెస్ట్ రేంజ్ అధికారికి (FRO) రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.బాధితుడు మరియు లేఖ వివరాల ప్రకారం ఈ నెల 3వ తేదీన ఉదయం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన లక్షల రూపాయల విలువైన హరితహారం చెట్లను, కానుగ మరియు రావి చెట్లను జేసీబీ (JCB) సహాయంతో నరికించి వేసినట్లు ఫిర్యాదుదారుడు పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులను సంప్రదించగా.. ఈ చెట్ల నరికివేతకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని స్పష్టమైంది. పచ్చని చెట్లను నిష్కారణంగా తొలగించిన సదరు పంచాయతీ కార్యదర్శిపై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు తన ఫిర్యాదులో కోరారు. ఈ ఫిర్యాదు ప్రతిని సిద్దిపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్ వారు స్వీకరించి, దర్యాప్తు చేపట్టారు.

వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన నిందితుడి అరెస్ట్

- 14 రోజుల రిమాండ్.. లక్షెట్టిపేట సబ్ జైలుకు తరలింపు



ప్రజా వాయిస్ తాండూర్/బెల్లంపల్లిమంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం తాండూర్ మండలం అచలాపూర్ గ్రామానికి చెందిన కొట్టే రవి అనే వ్యక్తి ఓ మహిళను వివాహం చేసుకుంటానని నమ్మించి, ఆమెతో సన్నిహితంగా మెలిగి శారీరకంగా వాడుకొని అనంతరం వివాహం చేసుకోవడానికి నిరాకరించిన ఘటనపై పోలీసులు చర్యలు చేపట్టారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాండూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు ఫిర్యాదును స్వీకరించి, ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. నిందితుడిపై క్రైం నంబర్ 108/2026, సెక్షన్ 69 బి ఎన్ ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగించారు. దర్యాప్తులో లభించిన ఆధారాలు, ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను పరిశీలించిన అనంతరం పోలీసులు నిందితుడిపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించారు.కేసు దర్యాప్తు పూర్తయిన అనంతరం కొట్టే రవిని పోలీసులు అరెస్ట్ చేసి బెల్లంపల్లి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. కేసు వివరాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.న్యాయస్థానం ఆదేశాల మేరకు నిందితుడు కొట్టే రవిని అనంతరం లక్షెట్టిపేట సబ్‌జైలుకు తరలించినట్లు తాండూర్ సబ్‌ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తెలిపారు. ఈ కేసులో చట్టపరమైన ప్రక్రియ కొనసాగుతుందని పోలీసులు వెల్లడించారు.



నూతన బస్టాండ్‌కు సంబంధించిన నమూనా నా భూతో నా భవిష్యత్తు అనేలా డిజైన్

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో నూతన బస్టాండ్ కు మార్గం సుగమం
- 54 కోట్ల రూపాయలతో నూతన బస్టాండ్ గా రెనోవేషన్ చేసేందుకు ప్రణాళిక సిద్ధం
- నూతన బస్టాండ్ నిర్మాణానికి 49,280 చదరపు అడుగుల బిల్ట్ అప్ ఏరియా
- 32,000 చదరపు అడుగుల బేస్ మెంట్ పార్కింగ్ సౌకర్యం
- పన్నులు మినహాయించి నిర్మాణ వ్యయం సుమారు రూ.54 కోట్లు శాంక్షన్

ప్రజా వాయిస్ /నల్గొండ క్రైమ్: నల్లగొండ జిల్లా ఎన్నో ఏళ్లుగా అభివృద్ధి కోసం ఎదురు చూస్తున్న నల్గొండ బస్టాండ్ కు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక చొరవతో నల్గొండలో ఆధునిక హంగులతో నూతన బస్టాండ్ నిర్మాణానికి మార్గం సుగమమైంది. ప్రస్తుత బస్టాండ్ను పూర్తి స్థాయిలో ఆధునీకరించి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా భారీ ప్రణాళిక సిద్ధ మైంది. ఇందుకోసం సుమారు రూ.54 కోట్ల నిర్మాణ వ్యయాన్ని ప్రభుత్వం మంజూరు చేసినట్లు సమాచారం.

భారీ నిర్మాణం,అధునాతన సౌకర్యాలు...

నూతన బస్టాండ్లో సుమారు 49,280 చదరపు అడుగుల బిల్‌అప్ ఏరియా ఉండనుంది. అంతేకాకుండా 32,000 చదరపు అడుగుల బేస్మెంట్ పార్కింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయనున్నారు.ప్రయాణికుల సౌకర్యాలు, పార్కింగ్, రాకపోకలు, ఆధునిక వసతులకు ప్రాధాన్యం ఇస్తూ బస్టాండ్ను తీర్చిదిద్దనున్నారు. నూతన బస్టాండ్ నమూనాను అత్యాధునికంగా, ప్రత్యేక ఆకర్షణగా ఉండేలా రూపొందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

కార్పొరేషన్ అభివృద్ధిలో మరోమైలురాయి...

నల్గొండ నగర అభివృద్ధిలో నూతన బస్టాండ్ నిర్మాణం మరో కీలక ముందడుగుగా నిలవనుంది. బస్టాండ్ ఆధు నీకరణ పూర్తయితే నగరానికి కొత్త రూపు రావడంతో పాటు, ప్రతిరోజూ రాకపోకలు సాగించే వేలాది మంది ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.నూతన బస్టాండ్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలుతెలిపారు.మొత్తంగా రూ. 54 కోట్లతో రూపు దిద్దుకోనున్న ఈ నూతన బస్టాండ్ నల్గొండ నగర అభివృద్ధికి కొత్త చిరునామాగా మారనుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి....

గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడి

- ఆస్పత్రికి వెళ్తే చాలు 1000 చెల్లించకుండా రాలేం
- దగ్గు అయినా... జ్వరం అయినా టెస్టులు చేయాల్సిందే
- అనుభవం అర్హత లేని డాక్టర్ లే వైద్యులు





ప్రజా వాయిస్,సంగారెడ్డి : పట్నం సంస్కృతి పల్లెలకు విస్తరించింది.... కార్పొరేట్ స్థాయిలో రంగురంగుల అద్దాలు ఏర్పాటు చేసి అనుభవం, భరత్ అనే నేను డాక్టర్లతో వైద్యం చేయిస్తూ లక్ష రూపాయలు దోచుకుంటున్నారు. దీనిపై జిల్లా అధికారులు ఏ ఒక్క రోజు కూడా తనిఖీలు చేసిన సందర్భాలు లేవు. ఏదైనా ఫిర్యాదులు వస్తే ఆ ఒక్కరోజు మాత్రమే తనిఖీలు చేసి ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేస్తున్నారు. తిరిగి 15 రోజులు గడవకుండానే చేతిలో డబ్బులు పెట్టి సీజ్ చేసిన ఆసుపత్రి ఓపెనింగ్ చేసి దజ్జగతమ్మ వ్యాపారాన్ని నిర్వహించుకుంటూ కోట్ల రూపాయలు అర్జిస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని అమాయకులు పచ్చేరాని వైద్యం చేస్తున్న వైద్యుల గురించి తెలియకపోవడంతో ఈ ఆస్పత్రిలోనే బాగా చూస్తారు అంటే ఇదే ఆసుపత్రిలో బాగా చూస్తారు అంటూ పోటీపడి చేయించుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 12 బెడ్ల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలంటే 24 గంటల పాటు ఎంబిబిఎస్ డాక్టర్ అందుబాటులో ఉంటే కానీ ప్రైవేట్ ఆస్పత్రి నిర్వహణకు అనుమతి ఇవ్వరు. కానీ మండల కేంద్రమైన పుల్కల్ లో ఉన్న మూడు ప్రధాన ప్రైవేట్ ఆస్పత్రుల్లోకు ఏ ఒక్క దాంట్లో కూడా ఎంబిబిఎస్ పూర్తి చేసిన డాక్టర్లు లేకపోవడం గమనార్హం. ఇది సాక్షాత్తు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సొంత మండలం కూడా. అయినా జిల్లా వైద్య అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చి పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రి డాక్టర్ తనకు వచ్చిరాని వైద్యంతో పెద్దరెడ్డిపేట గ్రామానికి చెందిన ఒక ఎన్ని సంవత్సరాల బాలుడికి వైద్యం చేయడంతో వైద్యం వికటించి ఆరోగ్యం క్షీణించింది. దీంతో కుటుంబ సభ్యులు సంగారెడ్డి లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ఇంతకుముందు వైద్యం చేసిన డాక్టర్ ఎవరు అసలు డాక్టర్ అతను అంటూ రోగి బంధువులను నిలదీశారు. ఇకపోతే పోచారం గ్రామం చెందిన మహేష్ అనే వ్యక్తి కుడికాలు పక్షికంగా వీరిగితే ఏమి కాదు రెండు రోజులు రెస్ట్ తీసుకో అంటూ పట్టి కట్టి పంపించారు. రోజురోజుకు నొప్పి తీవ్రతరం కావడంతో సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా కాలు విరిగినట్లుగా ఎక్స్రేలో తేలడంతో ఆమెరకు వైద్యం చేయించుకుంటున్నాడు. అంటే స్థానికంగా ఉన్న వైద్యులకు ఏ పార్టీ పరిజ్ఞానం ఉందో అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా దగ్గు జలుబు జ్వరం వచ్చిన టెస్టుల పేరుతో వేల రూపాయలు దండుకుంటున్నారు. ఇదంతా ప్రైవేట్ ఆస్పత్రులకు కొత్తేమి కాదు. రంగురంగుల అద్దాలు.... ఆసుపత్రిలో బెడ్లు అలంకరణకు ఈమాత్రం ఆర్భాటం చేయకుంటే వాళ్ళు నష్టపోక తప్పదు. అదే స్థాయిలో అర్హత అనుభవం ఉన్న డాక్టర్లు మాత్రమే నియమించి ప్రైవేట్ ఆస్పత్రికి నిర్వహణ కొనసాగించాలని నిబంధన ఉన్న దాన్ని ఎవరు పట్టించుకోవడం లేదు. తమకున్న రాజకీయ పలుకుబడితో జిల్లా మెడికల్ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తూ ఏడాదికి ఒకసారి రెన్యువల్ చేయించుకునే పరిస్థితుల్లో కూడా ఇక్కడికి వచ్చే డాక్టర్లు లేకపోయినా వారి ఫోటోలు పెట్టి పలనా వారం డాక్టర్ అందుబాటులో ఉంటాడంటూ ఫ్లెక్సీలు వేసి మరి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పుల్కల్లో మూడు ప్రైవేట్ ప్రధాన ఆసుపత్రులు కొనసాగుతున్నాయి. ఏ ఒక్క దాంట్లో కూడా అర్హత కలిగిన డాక్టర్లు లేకపోవడం విచిత్రంగా కనిపిస్తుంది. కానీ ఏ ఆసుపత్రికి ఆసుపత్రిలోనే ఫార్మసీ అంటే (మెడికల్ షాప్) అందులోనే మందులు తీసుకోవాలి బయట నుంచి తెచ్చుకుంటామంటే కుదరదు అంటారు డాక్టర్లు. దీన్నిబట్టి ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విస్తృతంగా వ్యాపించాయి. ఒక్కొక్క బెడ్ పై ఇద్దరి ముగ్గురినేసి సెలూన్ ఎక్కిస్తున్నారు. బెడ్ చార్జ్ మాత్రం వెయ్యి నుంచి 1200 వసూలు చేస్తున్నారు కానీ ఒక్క బెడ్ పై ఒక్క రోగికి మాత్రమే నిబంధన ఎవరు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా వైద్య అధికారులు స్పందించి ఈ ప్రైవేట్ ఆస్పత్రిలో అర్హత కలిగిన డాక్టర్లు ఎంతమంది ఉన్నారు... లేని ఆసుపత్రిలో ఎన్ని ఉన్నాయో వాటిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే గ్రామీణ ప్రాంతాలలో పూర్తిగా వ్యవసాయంపైనే ఆధార పడి జీవించే కుటుంబాలు అధికం.

దాహంతో జనం.. రోడ్డుపై మిషన్ భగీరథ నీళ్లు

- పాల్వాయి వద్ద లింగోటం పైప్ లైన్ కు భారీ లీకేజీ
- రోజులుగా వృథాగా పోతున్న తాగునీరు
- అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- వెంటనే లీకేజీని అరికట్టాలని ప్రజల డిమాండ్



ప్రజా వాయిస్ : గుర్రంపోడు మండలం నల్గొండ జిల్లా, గుర్రంపోడు మండలంలో పాల్వాయి గ్రామం దగ్గర ఒకవైపు తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతుంటే మరోవైపు ప్రజల దాహం తీర్చాల్సిన మిషన్ భగీరథ నీరు అధికారుల నిర్లక్ష్యంతో వృథాగా పోతోంది. పాల్వాయి పద్ద లింగోటం వైపు వెళ్లే పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి చాలా రోజులుగా వేల లీటర్ల విలువైన తాగునీరు రోడ్డుపై వృథాగా ప్రవహిస్తున్నా సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తాగడానికి నీళ్లు దొరకక ఇబ్బందులు పడుతున్నాం కానీ మా కళ్ల ముందే ప్రభుత్వ తాగునీరు ఇలా వృథాగా పోతుంటే అధికారులు ఎందుకు స్పందించడం లేదు అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లీకేజీని వెంటనే అరికట్టాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకపోయిందని గ్రామస్థులు వాపోతున్నారు.ప్రజల దాహం తీర్చేందుకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న విలువైన తాగునీరు ఇలా వృథా అవుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీని యుద్ధప్రాతిపదికన అరికట్టి నీటి వృథాను నిలిపివేయాలని, ప్రజలకు సక్రమంగా తాగునీరు అందించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాలి

- విద్యార్థుల ప్రాథమిక నైపుణ్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రజా వాయిస్ మంథనిపాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూనే, విద్యార్థుల అభ్యసన స్థాయిలను పెంచడంపై ప్రధానంగా దృష్టి సారించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం మంథని మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించడంతో పాటు వెంకటాపూర్ – ఆరెంద రహదారి విస్తరణ పనులను ప్రత్యక్షంగా తనిఖీ చేశారు.పర్యటనలో భాగంగా ఖాన్‌సాయిపేట పాఠశాల కాంపౌండ్ వాల్, పెయింటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వెంకటాపూర్ పాఠశాలలో మంజూరైన అదనపు తరగతి గది నిర్మాణాన్ని నెల రోజుల్లోగా అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. అలాగే వెంకటాపూర్ నుండి ఆరెంద వరకు ఉన్న రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించే పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. రోడ్డు విస్తరణ పూర్తయ్యే వరకు ప్రస్తుతం ఉన్న గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చి, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో తొలి విద్యా నైపుణ్యాల కార్యక్రమం ద్వారా ప్రతి విద్యార్థికి కనీసం చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు అబ్బేలా బోధన అందించాలని స్పష్టం చేశారు. విద్యలో వెనుకబడిన పిల్లలను ప్రత్యేకంగా గుర్తించి వారిపై మరింత శ్రద్ధ వహించాలని చెప్పారు. రోజువారీ హాజరు తక్కువగా ఉన్న పిల్లల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడాలని, ప్రతి పాఠశాలలో నెలకు ఒకసారి తప్పనిసరిగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేసి విద్యా ప్రగతిని వివరించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీజ రెడ్డి, మండల పరిషత్ అధికారి షబ్బీర్ పాషా, సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ జగదీశ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

దేవాలయాలలో చోరీలు చేస్తున్న దొంగలు అరెస్ట్



జూలూరుపాడు, ప్రజా వాయిస్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల పరిధిలోని దేవాలయాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుండి చోరీ సొత్తును స్వాధీనం చేసుకొని, న్యాయస్థానం ముందు హాజరు పరచి బుధవారం వారిని రిమాండ్ కు తరలించారు. స్టేషన్ పరిధి కొమ్ముగూడెం గ్రామంలోని దేవాలయంలో జరిగిన హుండీ చోరీకి సంబంధించి నమోదైన కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, సాంకేతిక ఆధారాలు, విశ్వసనీయ సమాచారం ఆధారంగా నిందితుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు.ఈ క్రమంలో బుధవారం మండల కేంద్రంలోని సాయిబాబా గుడి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా, వారు జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కొమ్ముగూడెం దేవాలయ చోరీతో పాటు, గతంలో పలు ప్రాంతాల్లోని దేవాలయాల్లో హుండీలను పగులగొట్టి నగదు చోరీలకు పాల్పడినట్లు వెల్లడైంది.నిందితులు రాత్రి సమయంలో జన సంచారం లేని దేవాలయాలను గుర్తించి, ఎవరూ లేని సమయాన్ని గమనించి దేవాలయాల్లోకి ప్రవేశించి హుండీలను పగులగొట్టి అందులోని నగదును చోరీ చేయడం అలవాటుగా చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.నిందితుల వద్ద నుండి 5,798 నగదు తోపాటు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.దేవాలయాలు, ప్రార్థనా మందిరాల వద్ద భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు, సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని మందిర నిర్వాహకులకు జూలూరుపాడు ఎస్సై జీవన్ కుమార్ సూచించారు.

21 కోట్లతో తెల్లాపూర్ లో రోడ్ అండర్ బ్రిడ్జి నిర్మాణం

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం ను కలిసిన ఎంపీ రైల్వే సమస్యలు
- ,ప్రతిపాదనలపై సమీక్ష



పటాన్ చెరువు ప్రజావాయిస్ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రోడ్డు అండ్ బ్రిడ్జి మంజూరైనట్లు మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు పటాన్చెరు నియోజకవర్గం పరిధిలోని తెల్లాపూర్ డివిజన్ పరిధిలో 21 కోట్ల రూపాయల విలువైన రోడ్ అండర్ బ్రిడ్జి ని మంజూరు చేయించడం జరిగిందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు.బుధవారం సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీ వాత్సవ ని కలిసి ధన్యవాదాలు తెలిపారు.అనంతరం మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని రైల్వే సమస్యలు,కొత్త ప్రతిపాదనలపై చర్చించారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.మెదక్ పార్లమెంట్ పరిధిలో దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.ఇందులో భాగంగానే తెలాపూర్,భెల్ ప్రాంతాల్లో ప్రజలు డిమాండ్ చేస్తున్న రోడ్ అండర్ బ్రిడ్జి (ఆర్ యు బి)ని మంజూరు చేయించామని,త్వరలో పనులు ప్రారంభిస్తామని అన్నారు.శనివారం రైల్వే అధికారులు,ఇతర శాఖల అధికారులతో కలిసి స్థల పరిశీలన చేస్తామని తెలిపారు.సంబంధీకులంతా హాజరు కావాలని కోరారు.ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం తెల్లాపూర్ రైల్వే స్టేషన్ ఆవరణలో ప్రయాణీకులకు ఉన్న అసౌకర్యాన్ని దూరం చేసేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేయించామని,ఈ నెలాఖరుకు పనులు ప్రారంభిస్తామని తెలిపారు.తెల్లాపూర్,భెల్ ప్రాంతంలో ప్రజలు సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు తీరనున్నాయని తెలిపారు.ఎంఎంటీఎస్ సేవలు విస్తరించాలి లింగంపల్లి వరకు వస్తున్న ప్రతీ ఎంఎంటీఎస్ రైల్ ను ఇటు రామచంద్రాపురం,అటు నాగులపల్లి వరకు పొడగించాలని జీఎం ను కోరినట్లు తెలిపారు. పశ్చిమ హైదరాబాద్ లో జనావాసాలు పెద్దఎత్తున పెరిగిన నేపథ్యంలో ట్రాఫిక్ నివారణ తో పాటు రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు ఎంఎంటీఎస్ విస్తరణ ఏకైక మార్గమని తెలిపారు.అయితే ఈ ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం నించి రావాల్సి ఉందని జీఎం తెలిపారని పేర్కొన్నారు.ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో పలువులు రైల్వే శాఖ అధికారులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

మాజీ సీఎం కేసీఆర్‌పై హేయమైన వ్యాఖ్యలు

- సీఎం రేవంత్, ఎమ్మెల్యే శంకర్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి
- రామగుండం 1 టౌన్ పిఎస్‌లో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఫిర్యాదు
- కేసీఆర్ చావును కోరుకోవడం అత్యంత దుర్మార్గం
- పాలన వదిలేసి కక్ష సాధింపు చర్యలా?

ప్రజా వాయిస్ గోదావరిఖని



తెలంగాణ రాష్ట్ర సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుపై కాంగ్రెస్ నాయకులు హేయమైన వ్యాఖ్యలు చేస్తున్నారని బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ మరణాన్ని కోరుతూ, భౌతిక దాడులను ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే కె.శంకరయ్యలపై బీఎన్ఎస్ చట్టప్రకారం తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రామగుండం 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన ఫిర్యాదు అందించారు. అనంతరం కోరుకంటి చందర్ విలేకరులతో మాట్లాడుతూ.. షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య కేసీఆర్‌పై బహిరంగంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం గర్హనీయమన్నారు. స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే నేతృత్వంలో కొంతమంది వ్యక్తులను కేసీఆర్ ఇంటికి పంపి, ఆయన మరణాన్ని కోరడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఇటువంటి సంస్కారహీన వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేరుగా ప్రోత్సాహం ఇస్తున్నారని ఆరోపించారు.?సాగునీరు, ఉచిత విద్యుత్, రైతుబీమా, పింఛన్లు, దళితబంధు, ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీల వంటి సంక్షేమ పథకాలతో తెలంగాణను అభివృద్ధి చేసిన నాయకుడిపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం తగదని చందర్ హితవు పలికారు. ప్రజలు పాలనకు అవకాశం ఇస్తే, దానిని పక్కనపెట్టి కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదని, సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మురళీధర్ రావు, మేకల సమ్మయ్య, తాళ్ల రాజన్న, మారుతి, అచ్చ వేణు, నూతి తిరుపతి, మేడి సదానందం, సాయి (చింటు), ఈదునూరి శ్రీకాంత్, కిరణ్ జీ, కత్యూరి ప్రవీణ్, సకినాల ప్రతాప్, గడ్డం పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో అంగన్వాడి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

అంగన్వాడి ఉద్యోగులను ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదు

అంగన్వాడి యూనియన్ జిల్లా నాయకురాలు మాధవి

ప్రజా వాయిస్.. వనపర్తి



తెలంగాణ అంగన్వాడి టీచర్స్ ఉ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీ సమావేశాలు అంగన్వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చిన సందర్భంలో పోలీసులు పాన్గల్, అన్నారం సెక్టర్లకు సంబంధించిన టీచర్లను ముందుగా అరెస్టు చేయడం అన్యాయమని యూనియన్ జిల్లా నాయకురాలు మాధవి అన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,,ప్రీ, ప్రైమరి, పీఎంశ్రీ మొత్తం 4,131 కేంద్రాలను తక్షణమే రద్దు చేయాలి. ఈ కేంద్రాలను అంగన్వాడీలకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేయాలని అన్నారు.ఐ.సి.డి.ఎస్ కు నిధులు పెంచి, బలోపేతం చేయాలని.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ. 18,000/- ల వేతనం వెంటనే నిర్ణయించాలి. పిఎఫ్ సౌకర్యం కల్పించాలి.టీచర్స్, హెల్పర్స్ మొత్తం 15 వేల భారీ పోస్టులన్నింటినీ ఒకేసారి భర్తీ చేయాలి. బి ఎల్ ఓ పెండింగ్ డబ్బులు, ఎస్ ఐ ఆర్ డ్యూటీ అమౌంట్ వెంటనే చెల్లించాలి.పెండింగ్ రిటైర్మెంట్ బెనిఫిట్స్, మినీ టీచర్స్ ఏరియర్స్, హెల్పర్ నుండి టీచర్ గా ప్రమోట్ అయిన వారికి పెండింగ్ పరియర్స్, పి ఆర్ సి ఏరియర్స్, 24 రోజుల సమ్మె వేతనాలు తదితర పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి.జూలై 3న ప్రజావాణిలో ఇచ్చిన వినతి పత్రంలోని డిమాండ్స్ అన్నింటిని పరిష్కరించాలి అని వారు డిమాండ్ చేశారు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ముందస్తుగా టీచర్లను హెల్పర్లను అరెస్టు చేసి ఉద్యమాలను ఆపాలనుకోవడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు, పోలీసులు అరెస్టు చేసిన వారిలో టీచర్స్ తిరుపతమ్మ, జిలేఖ్య, సుజాత , వెంకటమ్మ తదితరులు ఉన్నారు

కెసిఆర్ మరణం కోరిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేయాలి

షాద్నగర్ ఎమ్మెల్యే శంకర్ ను తక్షణమే అరెస్ట్ చేయాలి

బిఆర్ఎస్ వీపనగండ్ల మండల కమిటీ డిమాండ్

ప్రజా వాయిస్.. వీపనగండ్ల



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పై బహిరంగంగా మరణాన్ని కోరుతూ హాని చేయడానికి ప్రేరేపించేలా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో షాద్నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కె శంకరయ్య తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు పేర్లు వెల్లడించని ఇతర కుట్ర దారులపై భారతీయ న్యాయ సంహిత(బి ఎన్ ఎస్) 2023 లోని సెక్షన్లు 196,351/3,52, 353, మరియు 61, కింద ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలని కోరుతూ ఫిర్యాదు ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై కాంగ్రెస్ నాయకులు అత్యంత దుర్మార్గమైన, హేయమైన వాక్యాలు చేస్తున్నారని బి ఆర్ఎస్ వీపనగండ్ల మండల కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ మరణాన్ని బహిరంగంగా కోరుతూ, భౌతిక దాడులను ప్రేరేపించేలా వాక్యాలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, షాద్నగర్ ఎమ్మెల్యే శంకరయ్య లపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వీపనగండ్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.ఈకార్యక్రమంలో బి ఆర్ఎస్ ముఖ్య నాయకులు మండల అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, జొల్లు నారాయణ, నారాయణరెడ్డి, ఏటూరి కురుమయ్య, రాజ వర్ధన్ రెడ్డి, కృష్ణయ్య గౌడ్, మంగ దొడ్డి బాలకృష్ణ, శేఖర్, సురేష్, శేఖర్ రెడ్డి, బండారి విష్ణు, గద్దల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాల నిర్వహణపై శాంతి కమిటీ సమావేశం

ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు పోలీసుల సూచనలు

ప్రజా వాయిస్ వేములపల్లి



రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు వేములపల్లి ఎస్ఐ డి వెంకటేశ్వర్లు బుధవారం పోలీస్ స్టేషన్ ఆవరణంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు.గణేష్ మండపాల ఏర్పాటుకు ముందుగా పోలీసులతో పాటు సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు తగినంత విద్యుత్ భద్రత, అగ్నిమాపక జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. మండపాల వద్ద డీజేలు, లౌడ్‌స్పీకర్ల వినియోగంలో నిబంధనలు, శబ్ద పరిమితులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గణేష్ విగ్రహాల ఊరేగింపు మార్గాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలను పాటించాలని తెలిపారు. ఇతర మతాల పట్ల గౌరవం చూపుతూ సామరస్యాన్ని కాపాడాలని, సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు, పుకార్లు, రెచ్చగొట్టే సందేశాలను ప్రచారం చేయవద్దని హెచ్చరించారు.గణేష్ ఉత్సవాల సందర్భంగా యువత ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. విగ్రహ నిమజ్జనం సమయంలో పోలీసుల సూచనలు పాటిస్తూ శాంతియుతంగా, క్రమశిక్షణతో కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. గణేష్ ఉత్సవాలను భక్తి, భద్రత, సోదరభావంతో జరుపుకోవాలన సూచించారు. ఈ సమావేశంలో పోలీసు అధికారులు, గణేష్ మండపాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

మోతె మండల నూతన ప్రెస్ క్లబ్ ఎన్నిక....

అధ్యక్షుడు గా గట్టిగుండ్ల రాము...



మోతె సెప్టెంబర్ /ప్రజా వాయిస్

మోతె మండల నూతన ప్రెస్ క్లబ్ ను బుధవారం మండల మీడియా కార్యాలయం లో అధ్యక్షుడిగా ప్రజాదర్బార్ విలేకరి అయిన గట్టిగుండ్ల రాము ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షుడు, కోశాధికారిగా గురిజాల వెంకన్న , ప్రధాన కార్యదర్శిగా మాలోత్ కోటి,గౌరవ సలహాదారులుగా ఏర్పుల సాయికృష్ణ , సహాయ కార్యదర్శిగా దార మల్ల ఎలిషా, ప్రచార కార్యదర్శిగా చిలక చిరంజీవి కమిటీ సభ్యులుగా కొండ ఉదయ్ , యాతాకుల మధుసూదన్, వేముల రమేష్ ఎన్నుకోవడం జరిగింది. ఎన్నిక అనంతరం నూతన అధ్యక్షుడు రాము మాట్లాడుతూ.. జర్నలిస్టు సంక్షేమం కోసం జర్నలిస్టుల హక్కుల కోసం జర్నలిస్టుల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానని ప్రెస్ క్లబ్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థులను నిర్బంధించడం పై మా ఎమ్మెల్యే ఆగ్రహం

- జీవో నెంబర్ 97ను రద్దు చేయాలి

- విద్యార్థుల సమస్యల పరిష్కారం అయ్యేవరకు బిఆర్ఎఫ్ పోరాటం



ప్రజా వాయిస్,సంగారెడ్డి : పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆందోళనలోని పాలిటెక్నిక్ కాలేజ్ భవనంలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక సీఐతో పాటు ప్రిన్సిపల్ ఆందోళన చేస్తున్న విద్యార్థులను జాతీయ రహదారిపైకి రాకుండా గదిలోకి తలాలు వేయడం దారుణం అన్నారు. శాంతియుతంగా ఆందోళన చేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందన్నది పోలీసులు గుర్తించాలని... జోగిపేట సీఐ అనిల్ కుమార్ కాంగ్రెస్ పార్టీకి ఏజెంట్గా మాత్రమే పని చేస్తున్నారు కానీ.. ప్రజలను, క్రిమినల్ కేసులో మాత్రం ఈ మాత్రం శ్రద్ధ చూస్తే నియోజకవర్గంలో నేరాల సంఖ్య తో పాటు చోరీల కేసులు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులను నిర్బంధించినంత మాత్రాన సమస్య బయటకు రాకుండా పోదని... దీనికోసమే తమ స్వయంగా ఫేస్బుక్ ద్వారా విద్యార్థుల సమస్యలను లైవ్ లో సమాజానికి తెలిసే విధంగా బయటికి వేయడం జరిగిందన్నారు. విద్యార్థుల పక్షాన మేముంటాం జీవో నెంబర్ 97ను రద్దు చేసే వరకు మీకు అండగా ఉండి పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు.



వనపర్తి లో పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవికి వినతి పత్రం ఇచ్చిన రెండవ వార్డ్ కౌన్సిలర్ రమాదేవి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి కృష్ణ

ప్రజా వాయిస్.. వనపర్తి

బుధవారం నాడు వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవికి చిట్యాల రోడ్డు నల్లచెరువు శ్రీ చైతన్య స్కూల్ చౌరస్తాలో పండుగల సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా రెండవ వార్డ్ కౌన్సిలర్ రమాదేవి ముదిరాజ్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి కృష్ణ మాట్లాడుతూ పేదవారి కోసం ఎన్నో త్యాగాలు పోరాటాలు చేసిన మన ఉమ్మడి జిల్లా వాసి పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటుకు ఏ జెండాలో పెట్టాలని తీర్మానం అయ్యేటట్లు చూడాలని రమాదేవి ముదిరాజ్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కృష్ణ వినతి పత్రంలోకోరారు.ఇటీవల రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పండుగ సాయన్న జయంతిని అక్టోబర్ 24 వర్ధంతిని డిసెంబర్ 10 ప్రభుత్వ పరంగా నిర్వహించాలని జీవో కూడా విడుదల చేయడం ముదిరాజ్ బిడ్డలు సంతోషం వ్యక్తం చేశారని ఆయన అన్నారు. ఈనెల 24న హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై ప్రభుత్వపరంగా పండుగసాయన విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఏర్పాటు చేస్తున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే వనపర్తి లో కూడా పండుగల సాయన్న విగ్రహం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరుతున్నట్లు రెండవ వార్డ్ కౌన్సిలర్ రమాదేవి ముదిరాజ్ కృష్ణ తెలిపారు.



కృషి సఖీల శిక్షణలో భాగంగా కోసినీ రైతుల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన

ప్రజా వాయిస్ కగజ్ నగర్

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం కృషి సఖీలకు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణలో భాగంగా బుధవారం కాగజ్‌నగర్ మండలం కోసినీ గ్రామానికి చెందిన రైతులు వెంకటేశ్వర్లు, సురేష్ వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. వీరు గత సంవత్సరం నుంచి బీజామృతం, జీవామృతం వంటి సహజ వనరులను ఇంటి వద్దే తయారు చేసుకుంటూ రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి సాగు చేస్తున్నారు. సహజ వనరుల తయారీ విధానాన్ని సీఆర్‌పీలకు వివరించారు. అలాగే హెచ్‌డీపీఎస్ పద్ధతిలో సాగు చేస్తున్న పత్తి పొలాలు, ఆయిల్ పామ్ తోటలను కూడా చూపించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్, వ్యవసాయ సహాయ సంచాలకులు మనోహర్, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ మధు, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, టెక్నికల్ అధికారి దీప్తితో పాటు 21 మంది సీఆర్‌పీలు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాల నిర్వహణపై హిందూ ఉత్సవ సమితి సమావేశం

మండపాల నిర్వాహకులకు అండగా ఉంటాం అధ్యక్షుడు తాటి శ్రీనివాస్



ప్రజా వాయిస్ కగజ్ నగర్

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం పటేల్ గార్డెన్స్‌లో నూతనంగా ఎన్నికైన హిందూ ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం సమావేశం జరిగింది. రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సదుపాయాలు, ఏర్పాట్లపై చర్చించారు.కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సమితి పనిచేస్తుందని, పట్టణంలోని ప్రతి గణేష్ మండప నిర్వాహకులకు ఎలాంటి సమస్య వచ్చినా సమితి అండగా నిలుస్తుందని అధ్యక్షుడు తాటి శ్రీనివాస్ హామీ ఇచ్చారు.గణేష్ ప్రతిష్ఠాపన అనంతరం ఈ నెల 15న మండపాల నిర్వాహకులు, హిందూ బంధువులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలు, ఏర్పాట్లపై నిర్వాహకుల సూచనలు స్వీకరించి పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి అరుణ్ లోయా, కోశాధికారి దెబ్బటి శ్రీనివాస్, హిందూ జాగరణ్ మంచ్ జిల్లా అధ్యక్షుడు శివ గౌడ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



తెలుగు భాష దినోత్సవం
కాళోజి నారాయణరావు 112వ జయంతి

కాళోజి చూపిన మార్గంలో నడవాలని కలెక్టర్ పిలుపు

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్

కుమురం భీమ్ ఆసిఫాబాద్ కాళోజి నారాయణరావు 112వ జయంతి సందర్భంగా బుధవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హరిత జ్యోతి ప్రజ్వలన చేసి, కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మాట్, రెవెన్యూ కలెక్టర్ డేవిడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ యాదవ్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నోడల్ అధికారి భాస్కర్, మార్కెట్ చైర్మన్ మంగ, జడ్పీ సీఈవో తదితరులు పాల్గొన్నారు.కాళోజి సేవలు, సమాజం పట్ల బాధ్యతాభావాన్ని కలెక్టర్ స్మరించుకుంటూ, సామాజిక చైతన్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన విగ్రహాలకు బదులు మట్టి గణపతులను ప్రతిష్టించి, నిమజ్జన సమయంలో నీటి వనరులు కలుషితం కాకుండా చూడాలని పేర్కొన్నారు. పర్యావరణహిత పద్ధతుల ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించవచ్చని, ప్రజలు ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించాలని కోరారు.కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో కార్యక్రమంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి హైమద్, జిల్లా రవాణా శాఖ అధికారి, జిల్లా బాలల సంరక్షణ శాఖ అధికారి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజాకవి కాళోజీకి రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఘన నివాళి

ప్రజా వాయిస్ గోదావరిఖని

పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని బాధితులకు తక్షణ న్యాయం అందించేలా విధులు నిర్వహించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో కాళోజీ 112వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి సీపీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ, తెలంగాణ యాస, భాషల్లో సామాజిక అన్యాయాలు, దోపిడీని ప్రశ్నిస్తూ నా గొడవ రచనల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని నింపిన ప్రజా గొంతుక కాళోజీ అని కొనియాడారు. ప్రజల భద్రత కోసం పనిచేసే పోలీసు యూనిఫామ్ సమాజంలో నమ్మకానికి ప్రతీకగా నిలవాలని, మానవీయ దృక్పథంతో బాధ్యతాయుతమైన పోలీసింగ్ అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏవో శ్రీనివాస్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు భీమేశ్, శ్రీనివాస్, ఆర్ఐలు శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి
- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్



ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సుల్తానాబాద్ మండల బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. స్థానిక శాస్త్రినగర్ వద్ద ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధిగా ఉన్న వ్యక్తి రాజకీయ ప్రత్యర్థిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వ్యతిరేకంగా శవయాత్ర నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలుసుకున్న పోలీసులు మాజీ ఎంపీటీసీ సూర శ్యామ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్‌రావు, కొయ్యడ అరుణ్, గుర్రం శ్రీనివాసులను శ్రీరాంపూర్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.అనంతరం నిర్వహించిన దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిప్పారపు దయాకర్, మైలారం నారాయణ, క్యాదాసి చంద్రమౌళి, ఆనుమల బాబురావు, సంపత్, గుర్రం శ్రీనివాసు, రాజారామ్, గరిగంటి కుమార్‌బాబు, కోడం అజయ్, నరేష్, ఆరెపల్లి రాకేష్, అక్బర్, ఆరెపల్లి సురేష్, తిప్పారపు లక్ష్మణ్, చుంచుల రాకేష్‌తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

మునగ సాగుతో మహిళా రైతులకు అదనపు ఆదాయం

మహిళల ఆర్థిక బలోపేతానికి ఉద్యానశాఖ ప్రోత్సాహం

మునగ సాగును ప్రోత్సహించాలి: మున్సిపల్ చైర్మన్ జాము రవి

మేడ్చల్, శామీర్ పేట్ / ప్రజా వాయిస్ ప్రతినిధి

మహిళా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు వారికి అదనపు ఆదాయం కల్పించేందుకు ప్రభుత్వం, ఉద్యానవన శాఖ చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని మూడు చింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి సూచించారు. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో DRDA-MEPMA పరిధిలోని స్వయం సహాయక సంఘాల (SHG) మహిళా రైతులకు మునగ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రైతు వేదికలో నిర్వహించారు.a సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ జాము రవి హాజరై మహిళా రైతులకు





మునగ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ జాము రవి మాట్లాడుతూ..... మునగ సాగు ద్వారా మహిళా రైతులకు అదనపు ఆదాయం సమకూరడంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందన్నారు. మునగలో అధిక పోషక విలువలు ఉండటంతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. మహిళా రైతులు మునగ సాగుపై దృష్టి సారించి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మునగకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో రైతులకు ఆదాయ వృద్ధికి అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. “పచ్చని ప్రకృతి.. ఆరోగ్యమైన జీవితం.. మహిళల ఆర్థిక బలం” అనే లక్ష్యంతో SHG మహిళా రైతులను మునగ సాగు వైపు ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, హార్టికల్చర్ అధికారులు శ్రీధర్, వెంకటరమణ, సాగరిక, APM మునిస్వామి, మహిళా విభాగం అధ్యక్షురాలు అజయ లక్ష్మి, అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రవీణ, మహిళా రైతులు, SHG ఆర్ పి లు తదితరులు పాల్గొన్నారు.

సర్.. ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నది!

చిన్న చిన్న తేడాలే, ఐనా దాదాపు ఒక కోటి ఓటర్లకు నోటీసులు!

సిబ్బందికి “సర్” పై సమగ్రమైన అవగాహన కల్పించని ఈసీ.

అర్హులైనవారి ఓటు గల్లంతు కాకుండా చూసే బాధ్యత ఈసీదే.

తొర్రూరు ప్రజా వాయిస్

“సర్” ప్రక్రియలో ఇంతకు ముందే సబ్మిట్ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను పరిశీలించి పలు రకాల తేడాలను గుర్తించిన ఈసీ దాదాపు ఒక కోటి ఓటర్లకు నోటీసులు జారీ చేయడంతో వారంతా తమ ఓటు గల్లంతు అవుతుందేమోనని భయాందోళనలకు గురవుతున్నందున అర్హులైన వారి ఓటు పోకుండా చూసే బాధ్యత ఎలక్షన్ కమీషన్ దేనని సామాజికవేత్త దొనికెన కుమారస్వామి అన్నారు.

గత మూడు రోజులుగా ఈ విషయంపై క్షేత్ర స్థాయిలో చూసి గ్రహించిన పరిస్థితిని బుధవారం నాడు పాలకుర్తి నియోజకవర్గ సహాయ ఎన్నికల నమోదు అధికారి వక్కాల శ్యాంసుందర్ గారిని వారి ఆఫీసులో కలిసి “సర్” ప్రక్రియలో తలెత్తిన పలు సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించి ప్రజల ఆందోళనలను దూరం చేసి వారికి భరోసాను కల్పించాలని కోరుతూ ఒక వినతి పత్రాన్ని అందజేసిన అనంతరం దొనికెన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ఎలక్షన్ కమీషన్ నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంతో “సర్” ప్రక్రియ రాష్ట్రంలో సజావుగా జరగడంలేదని, సంబంధిత క్షేత్ర స్థాయి సిబ్బందికి గానీ అధికార యంత్రాంగానికి గానీ ఈ అంశంపై సమగ్రమైన పూర్తి సమాచారంతో అవగాహన కల్పించకపోవడం వల్లనే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని దొనికెన విమర్శించారు.

“సర్” పై అవగాహన లేకపోవడంతో బాధ్యులైన సంబంధిత సిబ్బంది ప్రజలకు సరియైన విధంగా సహకరించలేదని, దీంతో వారు తమ ఎన్యూమరేషన్ ఫారాలను “సర్” ఉద్దేశాలకు అనుకూలంగా



నింపలేకపోయారని, ఫలితంగా 2002తో ట్యాలీ జరగలేదనే కారణంతో దాదాపు 65 లక్షల వరకు అన్ మ్యాపింగ్ నోటీసులు మరియు దరఖాస్తుదారుని పేరు లేదా తండ్రి పేరులో వ్యత్యాసం ఉన్నదనే కారణంగా దాదాపు 35 లక్షల వరకు అనామలీస్ నోటీసులు జారీ చేయవలసి వచ్చిందని దొనికెన తెలిపారు.

ఇంగ్లీషు నుండి తెలుగులోకి గానీ తెలుగు నుండి ఇంగ్లీషులోకి గానీ మార్చే సందర్భంలో సాంకేతిక పరంగా కలిగిన చిన్న చిన్న తేడాలకు కూడా నోటీసులు ఇవ్వడం శోచనీయమని దొనికెన వాపోయారు.

ప్రజలను ఇబ్బందులపాలు చేయడానికి ఈసీ ఇంత పెద్ద ఎత్తున నోటీసులు జారీ చేయడమే కాకుండా వాటి క్లియరెన్స్ కోసం సంబంధిత అధికారులకు చూపెట్టాలని సూచించిన రుజువులు ఆధారాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాల విషయంలో కూడా స్పష్టత ఇవ్వలేదని దొనికెన విమర్శించారు.

నోటీసుల వెనుక సూచించిన 1.ఏదైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే ఉద్యోగికి లేదా పింఛనుదారునికి సంబంధించిన ధృవీకరణ పత్రం, 2.తేదీ 01-07-1987కు ముందు ప్రభుత్వ లేదా సేవా సంస్థలు జారీ చేసిన గుర్తింపు కార్డు, 3.జనన ధృవీకరణ పత్రం, 4.పాస్ పోర్ట్, 5.విద్యార్హత ధృవీకరణ పత్రం, 6.నివాస ధృవీకరణ పత్రం, 7.అటవీ హక్కుల ధృవీకరణ పత్రం, 8.కుల ధృవీకరణ పత్రం, 9.జాతీయ పౌర పట్టిక, 10.కుటుంబ రిజిస్టర్, 11.ప్రభుత్వ భూమి లేదా ఇంటి కేటాయింపు ధృవీకరణ పత్రం, 12.ఆధార్ కోసం తేదీ 09-09-2025, లేఖ నం.23/2025 ఈఆర్ఎస్ జారీ చేసిన కమీషన్ ఆదేశాలు, 13.తేదీ 01-07-2025 నాటి బీహార్ “సర్” యొక్క సారాంశం.. లాంటి ధృవీకరణ పత్రాలను ఆధారాలుగా అప్లోడ్ చేయాలని కోరిన ఈసీ, ఈ 13 పత్రాలు సమర్పించాలా? లేక ఎన్ని పత్రాలు సమర్పించాలి? అనే విషయంలో కూడా స్పష్టత ఇవ్వలేదని దొనికెన అన్నారు.

పైగా వీటిలో చాలా ధృవీకరణ పత్రాల గురించి దాదాపు చాలా మందికి తెలియదని, జాతీయ పౌర పట్టిక ఎలా ఉంటుంది? కుటుంబ రిజిస్టర్ అంటే ఏమిటి? అటవీ హక్కుల పత్రం ఎవరికి ఇస్తారు? అసలు బీహార్ “సర్” తో సంబంధం ఏమిటి? లాంటి వాటి గురించే కాకుండా 1వ, 2వ, 12వ నిబంధనలపై ప్రజలకు గానీ సిబ్బందికి గానీ ఒక క్లారిటీ లేదని, కొందరు పాస్ పోర్ట్ ను జతపరచడానికి ఇష్టపడడం లేదని దొనికెన తెలిపారు.

ఇలాంటి అయోమయ పరిస్థితిలో ప్రజలు సర్టిఫికేట్ల కోసం మీసేవ కేంద్రాల చుట్టూ, ఎమ్మార్వో ఆఫీసుల చుట్టూ, జిరాక్స్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ సమయాన్ని ధనాన్ని శ్రమను వృథా చేసుకుంటూ అవస్థలు పడుతున్నారని దొనికెన వాపోయారు.

ఇక ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ లాంటి వాటిని యాప్ పరిగణనలోకి తీసుకోవడం లేదని, అంతో ఇంతో అవగాహన ఉన్న 3వ, 5వ, 6వ, 8వ కాలమ్స్ లోని సర్టిఫికేట్లు కొంత మందికి ఉన్నా అవి అందుబాటులో ఉండవచ్చు లేకపోవచ్చు లేదా టైంకు దొరక్క పోవచ్చునని, ఇలాంటి అత్యవసర స్థితుల్లో వాటిని సమకూర్చుకోవడం కోసం సంబంధిత ఆఫీసులకు వెళితే ఇదే అదును అనుకొని సర్టిఫికేట్లు జారీ చేసే వారు చేతివాటం ప్రదర్శించవచ్చునని, తీరా ఏదో విధంగా అష్ట కష్టాలు పడి ఏదో ఒక సర్టిఫికేట్ తెచ్చి ఇస్తే, ఇది సరిపోదు ఇంకొకటి తేవాలని సిబ్బంది ఒప్పుకోవడం లేదని దొనికెన తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎలక్షన్ కమీషన్ విచక్షణతో వ్యవహరించి ఈ సమస్యను వీలైనంత త్వరగా ప్రజలకు ఇబ్బందులు కలుగని విధంగా పరిష్కరించాలని, అవసరమైతే ఈ విషయంలో పూర్తి అవగాహన కలిగిన మరికొంత మంది సిబ్బందిని ఇంకొన్ని ఎక్కువ కౌంటర్లను పెంచాలని దొనికెన కుమారస్వామి డిమాండ్ చేశారు.

వీధికో వినాయకుడు.. భక్తి పేరుతో పోటీ వద్దు!

విఘ్నేశ్వరుడి ఉత్సవాలు గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలవాలి

పురోహితులు సూర్య నారాయణ శర్మ

ప్రజావాయిస్ వేములపల్లి

వినాయక చవితి పండుగకు గ్రామాలు, పట్టణాలు సిద్ధమవుతున్నాయి. గణనాథుడి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేందుకు యువత ఉత్సాహం చూపుతోంది. అయితే కొన్ని గ్రామాల్లో విగ్రహాల ఏర్పాటు విషయంలో పోటీ వాతావరణం నెలకొంటుండటంపై గ్రామ పెద్దలు, ఆధ్యాత్మిక పండితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఒక వీధిలో వినాయకుడిని ఏర్పాటు చేస్తే మరో వీధిలో అంతకంటే పెద్ద ప్రతిమను ఏర్పాటు చేయాలనే ఆలోచన రావడం, ఒకరిని మించి మరొకరు ఉత్సవాలు నిర్వహించాలనే పోటీ పెరగడం వల్ల పండుగ స్ఫూర్తి పక్కదారి పడే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. కొన్ని గ్రామాల్లో గల్లీగల్లీకీ నాలుగైదు ప్రతిమలు ఏర్పాటు చేయడంతో చిన్నచిన్న విషయాలు కూడా మనస్పర్థలకు దారితీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు.

విఘ్నాలను తొలగించే దేవుడే.. విభేదాలకు కారణం కాకూడదు

పురాణాల్లో శ్రీ గణపతికి విశిష్టమైన స్థానం ఉంది. జ్ఞానం, శుభం, వివేకం, ఐక్యతకు ప్రతీకగా గణనాథుడిని ఆరాధిస్తారు. ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా ముందుగా గణపతిని పూజించడం సంప్రదాయం. మన జీవితాల్లోని విఘ్నాలను తొలగించాలని కోరుకునే గణనాథుడి ఉత్సవాలే మనుషుల మధ్య విభేదాలకు కారణం కాకూడదని పండితులు సూచిస్తున్నారు.“గణపతిని ఎంత పెద్ద విగ్రహంగా ఏర్పాటు చేశామన్నది కాదు.. ఎంత భక్తితో పూజించామన్నదే ముఖ్యం. ఉత్సవం వల్ల గ్రామంలో ఐక్యత పెరగాలి. ఒకరిపై ఒకరు పైచేయి సాధించాలనే పోటీ ఉండకూడదు. వినాయకుడు అందరివాడు.. ఆయన పండుగ కూడా అందరినీ కలిపేదిగా ఉండాలి’’ అని ఆధ్యాత్మిక పండితులు పేర్కొంటున్నారు.

భక్తితో పాటు సేవా కార్యక్రమాలు

వినాయక ఉత్సవాలను కేవలం భారీ విగ్రహాలు, అలంకరణలు, శబ్దాలతో కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తే పండుగకు మరింత ప్రాధాన్యం ఉంటుందని పెద్దలు చెబుతున్నారు. అన్నదానం, పేద విద్యార్థులకు సహాయం, మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాలు, పరిశుభ్రత కార్యక్రమాలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా గణనాథుడి ఉత్సవాలకు మంచి సందేశం జోడించవచ్చని సూచిస్తున్నారు.

మనసులు కలిస్తేనే.. గణపతి ఉత్సవానికి నిజమైన అర్థం

ప్రతిమల సంఖ్యపై, పరిమాణంపై, అలంకరణలపై పోటీ పడటంం కంటే గ్రామ ప్రజలంతా కలిసి పండుగను నిర్వహించుకోవడం ద్వారా సోదరభావం పెరుగుతుందని గ్రామ పెద్దలు అంటున్నారు. విగ్రహాలు ఎన్ని ఉన్నా అభ్యంతరం లేదు.. కానీ మనసులు విడిపోకూడదు అన్నదే వారి అభిప్రాయం.విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత నెలకొనాలంటే వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, అందరి సహకారంతో నిర్వహించుకోవాలని వారు కోరుతున్నారు. గణనాథుడి ఉత్సవాలు పోటీకి కాదు.. భక్తికి, విభేదాలకు కాదు.. ఐక్యతకు ప్రతీకగా నిలవాలని ఆకాంక్షిస్తున్నారు.







ఓటర్ల సవరణకు తగిన
పత్రాలు సమర్పించాలి
- తహసీల్దార్ వాసంతి

ప్రజా వాయిస్ కమాన్ పూర్

ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు తగిన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని తహసీల్దార్ ముస్త్యాల వాసంతి సూచించారు. మండలంలోని రొంపికుంట గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుమ్మడి శ్రీనివాస్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలోని ప్రతి నమోదును క్షుణ్ణంగా పరిశీలించి, సరైన ఆధారాలు తీసుకొని సవరణలు చేపడతామని స్పష్టం చేశారు. ఓట్లు తొలగిపోతాయని ఎవరూ అపోహ పడాల్సిన అవసరం లేదని, ప్రతీ ఓటును పారదర్శకంగా సరిచేస్తామని ఆమె హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో ఉప సర్పంచ్ ముత్యం శ్యాం సుందర్, సూపర్‌వైజర్ సతీష్, జీపీవో నాగరాజు, వార్డు సభ్యులు కొయ్యడ కుమార్, కొండి అనిల్ కుమార్, మిర్యాల రాజు, పులిపాక ముండయ్య, బిఎల్వోలు గుమ్మడి శారద, పులిపాక లక్ష్మి, బిఎల్ఏలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హమారా ప్రసాద్ పై దేశద్రోహం కేసు బుక్ చేయాలి
- దళిత సంఘాల ఐక్య కార్యచరణ సమితి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చిప్పల యాదగిరి డిమాండ్
- ఈనెల 18న పుస్తకావిష్కరణతో కుల ఘర్షణలకు కుట్ర
- అంబేద్కర్ అవమానానికి గజ్వేల్లో దిష్టిబొమ్మ దహనం
- సిఐటియు జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ఆగ్రహం

ప్రజా వాయిస్ సిద్దిపేట/ గజ్వేల్ నియోజకవర్గం :



అంబేద్కర్ పై కల్పిత నాయకుడు అని బుక్ రాని ఈనెల 18న ఆవిష్కరించడానికి చూస్తున్న హమారా ప్రసాద్ పై దేశద్రోహం కేసు బుక్ చేయాలని దళిత సంఘాల ఐక్య కార్యచరణ సమితి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చిప్పల యాదగిరి డిమాండ్ చేశారు. మనువాది దేశంలో కులాల మధ్య ఘర్షణలు సృష్టించాలని చూస్తున్న ఈ కుట్రను అడ్డుకోవాల్సిందేనని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సర్కిల్‌లో హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సందబోయిన ఎల్లయ్య సిఐటియు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ... అంబేద్కర్‌ను కించపరిచేలా ఎవరు మాట్లాడినా సహించేది లేదన్నారు. లేనిపక్షంలో దళిత బహుజన మైనారిటీలందరూ ఏకమై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సందీప్ రంగారెడ్డి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు, అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు పిడిచేడు లక్ష్మీనారాయణ, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు బ్యాగరి యాదగిరి, నాయకులు నీలమయ్య, రవీందర్, మల్లయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.





అటవీ సంపద,వన్యప్రాణుల రక్షణకు చర్యలు బలోపేతం చేస్తున్నాం
డివిజనల్ ఫారెస్ట్ అధికారి టి. భార్గవ్ కుమార్

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం అటవీ సంపద, వన్యప్రాణులు, సహజ పర్యావరణ పరిరక్షణకు అటవీ శాఖ ఆధ్వర్యంలో రక్షణ చర్యలను మరింత బలోపేతం చేస్తున్నట్లు కాగజ్‌నగర్ డివిజనల్ ఫారెస్ట్ అధికారి టి. భార్గవ్ కుమార్ తెలిపారు.అటవీ ప్రాంతాల్లో అక్రమ చెట్ల నరికివేత, అటవీ భూముల ఆక్రమణ, వన్యప్రాణుల వేట తదితర అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు నిరంతర పెట్రోలింగ్, రక్షణ గస్తీ, వాహన తనిఖీలు, సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అటవీ సిబ్బంది ప్రతిరోజూ తమ పరిధిలోని ప్రాంతాలను పర్యవేక్షిస్తూ, అనుమానాస్పద కార్యకలాపాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట్ల కెమెరా ట్రాప్‌లు, మొబైల్ పెట్రోలింగ్, ఆధునిక సాంకేతిక పర్యవేక్షణ వినియోగించాలని సూచించారు. అటవీ సంపదకు నష్టం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా వేట నిరోధక చర్యలు, నీటి వనరుల పర్యవేక్షణ, వన్యప్రాణుల కదలికల పరిశీలనకు డ్రోన్‌లు వినియోగించాలని డీఎఫ్ఓ సిబ్బందికి సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్, సిర్పూర్, కర్జెల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ ఎఫ్ఆర్ఓలతో పాటు డీఆర్ఓలు, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా ఆత్మగౌరవ ప్రదర్శన
స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ శ్రేణులు
బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
కాంగ్రెస్ కార్యకర్తలతో భారీ ర్యాలీ





శామీర్ పేట్ / ప్రజా వాయిస్ ప్రతినిధి :తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం తూంకుంట చౌరస్తాలో భారీ ఆత్మగౌరవ ప్రదర్శన నిర్వహించారు. తూంకుంట చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డప్పుల దరువులు, ఆత్మగౌరవ నినాదాలతో కాంగ్రెస్ శ్రేణులు భారీ ప్రదర్శన చేపట్టారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని బీఆర్ఎస్ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ..... శాసనసభ స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైనదని, అలాంటి అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిపై వ్యక్తిగతంగా, అనుచితంగా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని మండిపడ్డారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, రాజ్యాంగబద్ధ సంస్థలు, పదవుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని పేర్కొన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి వ్యాఖ్యలకు బాధ్యత వహించేలా చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ..... “మన ఆత్మగౌరవం కోసం.. మన ప్రజాస్వామ్యం కోసం కాంగ్రెస్ పార్టీ ఐక్యంగా పోరాడుతుంది. రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఎప్పుడూ ముందుంటాయి” అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం ఎస్సీ ఇన్‌చార్జి గజ్జల కాంతం, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, హజ్ కమిటీ సభ్యులు మొహమ్మద్ ముజీబ్ రుద్దిన్, జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాల ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆత్మగౌరవ ప్రదర్శనను విజయవంతం చేశారు.

పోరాట యోధుడు మావో సేటుంగ్





తొర్రూర్ ప్రజా వాయిస్

ప్రపంచవ్యాప్తంగా తమపై సాగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా పీడిత ప్రజలకు పోరాటం నేర్పిన పోరాట యోధుడు మావో అని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ తొర్రూర్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న అన్నారు. మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు మావో సేటుగ్ 50వ వర్ధంతి సందర్భంగా నేడు తొర్రూర్ తీ్ఎ బస్సు స్టాండ్ వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోట్లది మంది పీడిత ప్రజలకు పోరాట దిక్సూచిగా ఆయన నిలిచాడ అని అన్నారు. తన పోరాట ఎత్తుగడలు ఆచరణ సిద్ధాంత గ్రంథాల రచన చీకట్లో ఉన్న ప్రజలకు వెలుగులు వెదజల్లుతున్నాయని అన్నారు భారతదేశంలో భూమి, బుక్తి కనీస సౌకర్యాల కోసం ఎన్నో వర్గ పోరాటాలతో విజయాలు కొన్ని సాధించి వేలాది మంది ప్రాణాలర్పించారన్నారు. నక్సల్బరి,శ్రీకాకుళం, గోదావరి లోయ లలో అణగారిన వర్గాల ప్రజలకు భూమిని సాధించి పెట్టిన ఘనత మావో ఆలోచన విధానాన్ని అన్నారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం పేదరికం ఆకలి చావులు వలసలు కుల మత వివక్షతలను రూపుమాపటానికి మార్క్సిజం,లెనినిజం మావో ఆలోచన విధానం చూపిన మార్గం పోరాటమే ఏకైక మార్గం అని అన్నారు. నేడు పెరిగిన నిత్యవసర సరుకుల ధరలతో పేద సామాన్య బడుగు బలహీన వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆరోపణ చేశారు. కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరించి దోపిడీదారులు ఎర్ర తివాచిలు పరుస్తున్నారని అన్నారు. దీనిపై సామాజిక బాధ్యత ఉన్న ప్రతి ఒక్కరు ఐక్య ఉద్యమాల ద్వారా పాలకులకు తగిన గుణపాఠం చెప్పాలని అయన కోరారు. చైనా ఈరోజు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అగ్రగామిగా నిలవటానికి ముఖ్య కారకుడైన మావో ఆలోచన విధానం భారతీయప్రజలను నిత్యం చైతన్య పరుస్తుందని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ నాయకులు ఇరుగు అనిల్, తో పాటు టి యు సి ఐ నాయకులు మధు, వెంకన్న,పుల్లయ్య, లక్ష్మి, మమత, యశోద ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు...

ప్రజాకవి కాళోజీ నారాయణరావు
ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలి
ఘనంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలు
జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

మహబూబాబాద్ ప్రజా వాయిస్...

తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను బుధవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లిజిల్లా కలెక్టర్ స్నేహ శబరిలి ష్ హాజరై, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాకవి కాళోజీ తెలంగాణ ఆత్మను, ప్రజల జీవనాన్ని, సామాజిక స్పృహను తన కవిత్వంలో ప్రతిబింబించిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. తెలుగు మాత్రమే కాకుండా ఉర్దూ, హిందీ, మరాఠీ, ఆంగ్లం, తదితర భాషల్లో కూడా కవితలు రచించిన బహుభాషా కోవిదుడిగా కాళోజీ నిలిచారని తెలిపారు.సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటం చేసిన ప్రజా కవిగా కాళోజీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై స్పందిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కాళోజీ చేసిన కృషి అందరికీ ఆదర్శమని అన్నారు.కాళోజీ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1992లో పద్మ విభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసిందని గుర్తు చేశారు. ఒకసారి ఎమ్మెల్యేగా సేవలందించిన కాళోజీ ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు.జీవితాంతం మానవతా విలువలను ఆచరించిన కాళోజీ, మరణానంతరం కూడా తన అవయవాలను దానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కాళోజీ ఆశయాలు, మానవతా దృక్పథం, సామాజిక న్యాయం కోసం చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు.అదే విధంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, అధికారులు, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఐడీఓసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



స్పీకర్‌ను దూషించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం
- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి

సిద్దిపేట/ దుబ్బాక/ దౌల్తాబాద్,

శాసనసభ స్పీకర్‌ను దూషించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి అన్నారు. బుధవారం దౌల్తాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చించేందుకు సభ్యులకు పూర్తి అవకాశం ఉంటుందని, అయితే సభా నియమాలను ఉల్లంఘిస్తూ స్పీకర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. స్పీకర్ పదవికి, శాసనసభ గౌరవానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సూచించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో సభా నియమాలు, సంప్రదాయాలను గౌరవించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని మల్లారెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్ష సభ్యులు ప్రజా సమస్యలను లేవనెత్తే సమయంలో సభా మర్యాదలను పాటించాలని సూచించారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి ప్రజాస్వామ్యంలో అవకాశం ఉన్నప్పటికీ, వ్యక్తిగత దూషణలకు పాల్పడటం తగదన్నారు.స్పీకర్ నిర్ణయాలను రాజకీయ కోణంలో చూడకుండా సభా నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు



కరణాల శ్రీనివాసరావు, భద్రయ్య,సర్పంచ్ బండారు లాలు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు స్వామి, ఉపాధ్యక్షుడు రాజేశం, డాకోల ఆంజనేయులు గౌడ్ , నర్సంపల్లి భాస్కర్, తలారి ఏసు, సయ్యద్ ఆమ్జాద్, సింధు, రాజు, కొలుపుల నవీన్,డేవిడ్,సుంకు రమేష్ మాచినపల్లి, రమేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో, సమన్వయంతో విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

మహబూబాబాద్ ప్రజా వాయిస్..

మహబూబాబాద్ జిల్లాలో వినాయక నిమజ్జన వేడుకలను అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తో కలిసి, వినాయక నిమజ్జన వేడుకలపై రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, పోలీస్ తదితర శాఖల ఉన్నతాధికారులతో నిమజ్జన ఏర్పాట్లపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించి, కీలక దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శోభాయాత్ర సాగే ప్రధాన మార్గాల్లో, నిమజ్జన ఘాట్ల వద్ద పోలీస్ శాఖ పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి, సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా రూట్ డైవర్షన్ ప్రణాళికలు అమలు చేయాలన్నారు.విగ్రహాల ఊరేగింపు మార్గాల్లో రోడ్ల మరమ్మతులు, గుంతల పూడ్చివేత పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. నిమజ్జనం పూర్తయిన వెంటనే వ్యర్థాలను తొలగించేందుకు పారిశుధ్య కార్మికులను షిఫ్టుల వారీగా నియమించాలి.ఊరేగింపు మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను సంబంధిత శాఖల వారు సరిచేసి, ఎత్తు పెంచాలన్నారు.విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్‌తో పాటు ఘాట్ల వద్ద అదనపు జనరేటర్లు, హైమాస్ట్ లైట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బంది కలగకుండా, క్రేన్లు సులభంగా నిలిచేందుకు మరియు విగ్రహాలు నీటిలో సరిగ్గా మునిగేందుకు నిమజ్జన పాయింట్ల వద్ద పూడిక తీత పనులు చేపట్టాలని అన్నారు.ఇరిగేషన్ అధికారులు నిమజ్జనం జరిగే చెరువులు, జలాశయాలు లేదా కాలువల్లో తగినంత నీటి మట్టం ఉందో లేదో పర్యవేక్షించి మండల అధికారులను సమన్వయం చేసుకొని నివేదికలు అందజేయాలని అన్నారు.ప్రమాదాలు జరగకుండా ఘాట్ల వద్ద బలమైన బారికేడింగ్, గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లతో కూడిన ప్రత్యేక రెస్క్యూ టీమ్‌లను మోహరించాలన్నారు. అగ్నిమాపక శకటాలను (ఫైర్ ఇంజిన్లు) ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలన్నారు.మండప నిర్వాహకులు, ప్రజలు అధికారులకు సహకరించి, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని నిబంధనలకు అనుగుణంగా నిమజ్జనం పూర్తి చేయాలని అన్నారు.మండల స్థాయిలో తహసీల్దార్లు పంచాయతీ కార్యదర్శులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి అవసరమైన ఏర్పాట్లపై కార్యాచరణ రూపొందించాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు.నిమజ్జనం పూర్తయిన తరువాత ఘాట్ల వద్ద, ప్రధాన రహదారులపై మున్సిపల్ మరియు పంచాయతీ సిబ్బంది సహాయంతో మట్టి, వ్యర్థాలు, పూజా సామగ్రిని తొలగించి శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను నమోదు చేసి అనుమతి పొందాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేని వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతులు పొందిన తర్వాతే మండపాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పురుషోత్తం, డి.ఆర్.ఓ. నాగావాణి, డి.ఆర్.డి.ఓ మధుసూధనరాజు, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఒ లు రాజేశ్వరీ, గణేష్ ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





వకీల్ పల్లి గ్రూప్ ఏజెంట్ నెహ్రూకు ఆత్మీయ వీడ్కోలు

ప్రజా వాయిస్ 8వ కాలనీ

సింగరేణి రామగుండం ఏరియా-2 వకీల్ పల్లి గ్రూప్ ఆఫ్ మైన్స్ ఏజెంట్‌గా సేవలందించి, బదిలీపై రామగుండం ఏరియా-1 పరిధిలోని జీడీకే 11ఏ ఇంక్లైన్ గ్రూప్ ఏజెంట్‌గా వెళ్తున్న ఎ. నెహ్రూకు మంగళవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిఎం కార్యాలయ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రామగుండం ఏరియా-2 జనరల్ మేనేజర్ తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ ఆయనను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి వీడ్కోలు పలికారు. ?ఈ సందర్భంగా జిఎం లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ, వకీల్ పల్లి గ్రూప్ ఏజెంట్‌గా నెహ్రూ అందించిన సేవలను అభినందించారు. నూతన బాధ్యతల్లోనూ ఆయన విజయవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం మాలోతు రాముడు, అధికారుల సంఘం జనరల్ సెక్రెటరీ పెద్ది నరసింహులు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్, డిజిఎం (పర్చేస్) వెంకట రామచందర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ బి.వి. సత్యనారాయణ, ఓసీపీ-3 ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉదయ్ హరిజన్, డిజిఎం (ఈడిఎం) రాంరెడ్డి, భూగర్భ గనుల శిక్షణ అధికారి అబుహాస్సేన్, ఏరియా సర్వే ఆఫీసర్ బందోపాధ్యాయ చటర్జీ, డీవైపీఎం (ప) సునీల్ ప్రసాద్, అకౌంట్స్ మేనేజర్ తిరుపతి రెడ్డి, డిజిఎం (సీహెచ్‌పీ) బాలాజీ రావు, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ వేణు కుమార్, రెస్క్యూ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొని నెహ్రూకు శుభాకాంక్షలు తెలిపారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆత్మగౌరవ ప్రదర్శన

దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ శ్రేణుల భారీ నిరసన

మేడ్చల్, మూడుచింతలపల్లి / ప్రజా వాయిస్ ప్రతినిధి : తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌ల వ్యాఖ్యలను నిరసిస్తూ మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ ఆత్మగౌరవ ప్రదర్శన నిర్వహించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేశ్ యాదవ్ పిలుపు మేరకు తూంకుంట నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు డప్పుల దరువులతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ప్రదర్శన చేపట్టారు.ఈ నిరసన కార్యక్రమానికి మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్ నాయకత్వం వహించారు. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులను సమీకరించి ప్రదర్శనను విజయవంతం చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. డప్పుల దరువులతో ముందుకు సాగిన కాంగ్రెస్ శ్రేణులు ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ గౌరవాన్ని కాపాడాలని నినాదాలు చేశారు.

ప్రజాస్వామ్య విలువలను కించపరిచే వ్యాఖ్యలు సరికాదు: దోసకాయల వెంకటేష్

ఈ సందర్భంగా మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్ మాట్లాడుతూ, తెలంగాణ శాసనసభ స్పీకర్ వంటి రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని అన్నారు. శాసనసభ గౌరవాన్ని, రాజ్యాంగ వ్యవస్థను ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లపై సమగ్ర విచారణ జరిపి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కించపరిచే విధంగా ఎవరూ వ్యవహరించకూడదని, రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చి ఆత్మగౌరవ ప్రదర్శనను విజయవంతం చేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లకు దోసకాయల వెంకటేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా నిలవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కటికల శ్రీవాణి, దోసకాయల లత, పెద్దిరెడ్డి శ్రీలత, గోవర్ధన్ రెడ్డి, బొమ్మలపల్లి మల్లేశ్, పులి ప్రభాకర్, గోనె మహేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, వైద్యనాథ్, బసవ రెడ్డి, దామోదర్ రెడ్డి, గడ్డం రమేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, జెర్రిపోతుల నరసింహులు, రాజేంద్రప్రసాద్ గౌడ్, బీసీ సెల్ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగేష్, కొల్తూరు గ్రామ శాఖ అధ్యక్షులు రమేష్, కటికల కరుణాకర్, బండి జగన్నాథం, వీరేశం గుప్తా, ఆకుల నగేష్, శ్రవణ్ గుప్తా, దుర్గం ప్రవీణ్, తిరిపిగల్ల శ్రీనాథ్, లక్ష్మణ్, తిరుపతి రెడ్డి, కొల్తూరు మహేష్, పొన్నాల నర్సింగరావు, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. డప్పు కళాకారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.





విద్యార్థులకు యూనిఫామ్, షూల పంపిణీ

ప్రజా వాయిస్‌కమాన్‌పూర్

మండల పరిధిలోని పెంచికల్‌పేట్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ పల్లె మాధవి నారాయణ దంపతులు యూనిఫామ్, షూలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, శ్రద్ధతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు గ్రామపంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. అనంతరం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న పాఠశాల హెచ్ఎం ఎస్.కె. షంషూద్దిన్‌ను సర్పంచ్ దంపతులు, వార్డు సభ్యుడు జాగటి మనోహర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీలో కుకుడాల ఆంజనేయులుకు డాక్టరేట్....

ప్రజా వాయిస్ /నల్గొండ క్రైమ్:

హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన 85వ స్నాతకోత్సవ కార్యక్రమంలో హాలియా ప్రాంతానికి చెందిన కుకుడాల ఆంజనేయులు డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భారత్ బయోటెక్ చైర్మన్ డా. కృష్ణ ఎల్లా, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్ములుగారం తదితరులు పాల్గొన్నారు.కామర్స్ విభాగంలో పరిశోధన పూర్తి చేసిన ఆంజనేయులకు డాక్టరేట్ లభించడం పట్ల కుటుంబ సభ్యులు, మిత్రులు, విద్యావేత్తలు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. హాలియా ప్రాంతానికి చెందిన ఆయన పేద కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి ఎన్నో కష్టాలను అధిగమిస్తూ విద్యారంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించారు.పట్టుదల, కృషి, విద్యపై ఉన్న ఆసక్తితో ఉన్నత స్థాయికి ఎదిగిన ఆంజనేయులు ప్రస్తుతం శ్రీ శ్లోకా స్కూల్స్ చైర్మన్‌గా విద్యారంగంలో సేవలందిస్తున్నారు. పేద కుటుంబ నేపథ్యం నుంచి ప్రారంభమైన ఆయన ప్రస్థానం డాక్టరేట్ సాధించే స్థాయికి చేరుకోవడం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడ్డారు.ముఖ్యంగా సామాజికంగా వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన యువత పట్టుదలతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆంజనేయులు విజయగాథ చాటిచెబుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు కుకుడాల ఆంజనేయులకు అభినందనలు తెలిపారు.



శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

ముల్కనూర్ ఎస్సై రాజు



ప్రజా వాయిస్, భీమదేవరపల్లి: గణేష్ నవరాత్రి ఉత్సవాలను నియోజకవర్గ ప్రజలు అత్యంత ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ముల్కనూర్ ఎస్సై రాజు పిలుపునిచ్చారు. మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా ఈ వేడుకలను జరుపుకోవాలని ఆయన కోరారు. ఉత్సవాల నిర్వహణలో పోలీసు శాఖ సూచనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.వినాయక విగ్రహాలను తీసుకువచ్చే సమయంలో ప్రజలకు, భక్తులకు ఇబ్బంది కలిగించే అధిక శబ్దాల డీజేలకు ఎలాంటి అనుమతి లేదని ఎస్సై తేల్చిచెప్పారు. భద్రతా చర్యల్లో భాగంగా ప్రతి గణేష్ మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి మండపానికి సంబంధించిన వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేసుకోవడం అత్యవసరమని తెలిపారు. మండపం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా 24 గంటల పాటు కనీసం ఇద్దరికంటే ఎక్కువ మంది వాలంటీర్లు అందుబాటులో ఉండేలా నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల సూచనలను ప్రతీ ఒక్కరూ పాటించాలని ఆయన సూచించారు. ఈ ఏడాది గణేష్ ఉత్సవాలను సంపూర్ణంగా మద్యపాన రహితంగా, పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వేడుకలు పూర్తయ్యే వరకు నిర్వాహకులు, గ్రామస్థులు పోలీసు శాఖకు సంపూర్ణంగా సహకరించి ఉత్సవాలను దిగ్విజయం చేయాలని ఎస్సై రాజు కోరారు.

మానవత్వాన్ని చాటుకున్న కరాటే మాస్టర్ తంగేళ్ల సత్యనారాయణ రాజు

ప్రజా వాయిస్ /నల్గొండ క్రైమ్:

నల్గొండ జిల్లా అనుముల మండలం హాలియా కేంద్రంలో నిజాయితీ, మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు కరాటే మాస్టర్ తంగేళ్ల సత్యనారాయణ రాజు ఈ నెల 6వ తేదీ ఆదివారం హాలియాలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో సత్యనారాయణ రెడ్డి అనే వ్యక్తి రూ.43,000 నగదును డిపాజిట్ చేసేందుకు వచ్చారు. నగదు డిపాజిట్ అయినట్లు భావించి ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ఆ నగదు ఏటీఎం నుంచి తిరిగి బయటకు రావడంతో, ఆయన వెనుకనే ఉన్న కరాటే మాస్టర్ తంగేళ్ల సత్యనారాయణ రాజు ఆ డబ్బులను గుర్తించారు.రూ.43,000 నగదును భద్రంగా ఉంచి, దానిని సంబంధిత వ్యక్తికి లేదా బ్యాంకు మేనేజర్ గారి కి అప్పగించాలని.నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో 9వ తేదీ బుధవారం ఖాదీ× బ్రాంచ్ మేనేజర్ లావురి మోహన్ నాయక్ ఆధ్వర్యంలో ఆ నగదును అప్పగించారు.తన నగదు తిరిగి అందడంతో సత్యనారాయణ రెడ్డి కరాటే మాస్టర్ తంగేళ్ల సత్యనారాయణ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఖాదీ× బ్రాంచ్ మేనేజర్ లావురి మోహన్ నాయక్ ఆయన నిజాయితీ, మానవత్వాన్ని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.కరాటే మాస్టర్ తంగేళ్ల సత్యనారాయణ రాజు లాంటి నిజాయితీ, మానవత్వం కలిగిన వ్యక్తులు సమాజంలో ఉండటం ఎంతో గర్వకారణం. ఆయన చేసిన ఈ మంచి పని ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుంది" అని బ్యాంకు మేనేజర్ కొనియాడారు.ఈ సందర్భంగా తంగేళ్ల సత్యనారాయణ రాజు మాట్లాడుతూ, "ఇతరుల సొమ్మును కాపాడి వారికి తిరిగి అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అది ఏ ఏమర్జన్సీ సొమ్మో కాబట్టి మన దగ్గర లో ఇలాంటి సంఘటన జరిగితే తప్పకుండ తిరిగి అందేలా చెయ్యాలి . మానవత్వం, నిజాయితీకి ఎప్పటికీ విలువ ఇవ్వాలి" అని అన్నారు.నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన కరాటే మాస్టర్ తంగేళ్ల సత్యనారాయణ రాజును పలువురు అభినందించారు.



ప్రతి విద్యార్థి జీవిత లక్ష్యం నిర్దేశించుకోవాలి

దోమకొండ గురుకుల కళాశాలను సందర్శించిన బాలల హక్కుల కమిషన్

విద్యార్థినిలకు జీవిత పాటలు నేర్పిన కమిషన్ సభ్యులు

విద్యార్థులకు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ సీతా దయాకర్ రెడ్డి హితబోధ



ప్రజా వాయిస్ దోమకొండ, సెప్టెంబర్ 9

దోమకొండ బాలికల గురుకుల పాఠశాలకు వచ్చిన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి విద్యార్థినిలతో ఇష్టంతో కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని అన్నారు.బుధవారం దోమకొండ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలోని విద్యార్థినిలతో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్, సభ్యులు ప్రత్యేకంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్న వయస్సు నుంచే జీవితానికి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే దిశగా కష్టపడి ముందుకు సాగాలని సూచించారు. మన పై నమ్మకం ఉన్న ప్రతీ ఒక్కరు వమ్ము చేయకుండా గర్వపడేలా ఎదగాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు చదువు, క్రమశిక్షణ, బాలల హక్కులు, భవిష్యత్ లక్ష్యాలపై అవగాహన కల్పించారు.అర్థం కాని పాఠాలను ఉపాధ్యాయులను మరల అడిగి తెలుసుకోవాలన్నారు.గురువులు బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలని శ్వేతదయాకర్‌రెడ్డి సూచించారు. విద్య జ్ఞానాన్ని అందించడంతో పాటు క్రమశిక్షణను నేర్పుతుందని తెలిపారు.విద్యార్థుల దశలో ఇంటర్మీడియట్ కీలక దశ అని,ఈ సమయంలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని అన్నారు. జీవితంలో ఎదురయ్యే ఆటుపోటులను తెలివితో ఎదుర్కొనే విధంగా సిద్ధమవ్వాలని శ్వేతదయాకర్‌రెడ్డి హితబోధ చేశారు. జీవితంలో ప్రతి ఒక్కరు సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చినంత మాత్రాన వెనకడుగు వేయకూడదని సూచించారు. ఓటమి భవిష్యత్ విజయానికి నాంది అనుకుని ముందుకు సాగాలి అన్నారు.ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్ భాషతో పాటు కంప్యూటర్ విద్యపై పట్టు సాధించాలని సూచించారు. ఇంగ్లీష్, కంప్యూటర్ పరిజ్ఞానం ఉంటే దేశ, విదేశాల్లో విస్తృతమైన ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇంటర్నెట్‌ను జాగ్రత్తగా వినియోగించాలని, సైబర్ మోసాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలని, క్రీడల్లో పాల్గొని ప్రతిభను వెలికితీయాలని శ్వేతదయాకర్‌రెడ్డి అన్నారు. పెద్దలను గౌరవించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మాటలను గౌరవిస్తూ క్రమశిక్షణతో జీవించాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో విద్యార్థులు కూడా అవగాహన కల్పించాలని కోరారు. బాలల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు వచన్‌కుమార్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి షేక్ సలామ్ , జిల్లా విద్యాధికారి మల్లికార్జున్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి శ్రవంతి, బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు స్వర్ణలత, డీసీఓ శివరాం, మండల విద్యాధికారి విజయ్‌కుమార్, ప్రిన్సిపాళ్లు చైతన్య సుధ,వైస్ ప్రిన్సిపల్ మీనాక్షి, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ కవిత తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

ప్రజా వాయిస్ కమాన్ పూర్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ (ఎంపీడీవో) కార్యాలయాల్లో బుధవారం ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు 119వ జయంతి వేడుకలను అధికారులు ఘనంగా నిర్వహించారు. ?తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ముస్త్యాల వాసంతి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సాదినేని ప్రియాంక అధ్యక్షతన ఈ వేడుకలు వేర్వేరుగా జరిగాయి. ఈ సందర్భంగా అధికారులు ముందుగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజీ సమాజానికి, ప్రజా ఉద్యమాలకు అందించిన సేవలను అధికారులు స్మరించుకున్నారు. ?ఈ కార్యక్రమాల్లో ఆర్ఐ శ్రవంతి, సీనియర్ అసిస్టెంట్ వంశీ, జూనియర్ అసిస్టెంట్ సముద్రాల కిరణ్ కుమార్, రాము, ఏపీవో లావణ్య, గ్రామ కార్యదర్శులు రామ్మోహన్, అమీనా, ఝాన్సీ, గుమ్మడి సదయ్య, రాముతో పాటు జీపీవోలు జ్యోతి, రాజేందర్ మరియు ఇతర రెవెన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక సాగుతోనే అధిక లాభాలు!

వరి, పత్తి రైతులకు ఆత్మా ఆధ్వర్యంలో సమగ్ర శిక్షణ

శాస్త్రవేత్త ఫణిశ్రీ, ఎఫ్‌టీసీ అధికారి అరుణకుమారి పిలుపు

ప్రజా వాయిస్ ఖమ్మం

సాంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాంకేతికతతో కూడిన యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఫణిశ్రీ, ఎఫ్‌టీసీ అధికారి అరుణకుమారి స్పష్టం చేశారు. బుధవారం నేలకొండపల్లి రైతు వేదికలో ఆత్మా ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక అవగాహన, సమగ్ర శిక్షణ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మారుతున్న ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని హెచ్చరించారు. ముఖ్యంగా వరి, పత్తి పంటలను ఆశించే కాండం తొలిచే పురుగు, అగ్గితెగులు, పత్తిలో గులాబీ రంగు కాయతొలిచే పురుగు ఉధృతిని ప్రాథమిక దశలోనే గుర్తించి నివారించాలన్నారు. షాపుల వారి మాటలు నమ్మి అవసరానికి మించి పురుగుమందులు, రసాయనాలు పిచికారీ చేసి అనవసరంగా పెట్టుబడి భారం పెంచుకోవద్దని హితవు పలికారు. రసాయనాల మితిమీరిన వాడకంతో నేల నిస్సారమైపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తూ.. పెట్టుబడి తగ్గించి, దీర్ఘకాలిక లాభాలు పొందాలంటే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. భూసార పరిరక్షణే



రైతు భవిష్యత్తుకు నిజమైన పెట్టుబడి అని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాధ గారితో పాటు వివిధ క్లస్టర్ల వ్యవసాయ విస్తరణ అధికారులు దాత్రి అవినాష్, రవితేజ, శివ, శ్రీకాంత్, దుర్గాభవాని మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఆర్ఆర్ఆర్ భూసేకరణ వేగవంతం చేయాలి

- రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి కె. గంగాధర్
- భూసేకరణ పూర్తి చేసి హైవే అధికారులకు అప్పగించాలని ఆదేశాలు
- ఆర్బిట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచనలు
- రాయపోల్ నుంచి జగదేవ్‌పూర్ వరకు భూసేకరణపై సమీక్ష
- జిల్లా కలెక్టర్ కె. హైమావతి

ప్రజా వాయిస్ గజ్వేల్ :

రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి నేషనల్ హైవే అధికారులకు భూమిని అప్పగించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి కె. గంగాధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతితో కలిసి నేషనల్ హైవే, రెవెన్యూ శాఖ అధికారులతో ఆర్ఆర్ఆర్ భూసేకరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కె. గంగాధర్, కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రీజినల్ రింగ్ రోడ్డును ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా చేపట్టాయని తెలిపారు. జిల్లాలో రాయపోల్, వర్గల్, మర్కుక్, గజ్వేల్, జగదేవ్‌పూర్ మండలాల మీదుగా ఆర్ఆర్ఆర్ వెళ్లనున్న నేపథ్యంలో భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన ఆర్బిట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణలో ఎలాంటి సమస్యలు, అవరోధాలు ఎదురైనా సంబంధిత అధికారులు సమన్వయంతో వాటిని పరిష్కరించుకోవాలని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డుతో ఆయా ప్రాంతాలకు కలిగే అభివృద్ధి, ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఆర్డీఓ ఆధ్వర్యంలో తహసీల్దార్లు, ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ భూసేకరణను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో డ్రోన్ సర్వే నిర్వహించాలని, రైతులు పంటలు సాగు చేయకుండా అవసరమైన చర్యలు చేపట్టి భూమిని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం నిబంధనల ప్రకారం భూసేకరణ పూర్తయిన భూమిని నేషనల్ హైవే అధికారులకు అప్పగించాలని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించి నేషనల్ హైవే అథారిటీకి అప్పగించిన భూమి బాధ్యత పూర్తిగా ఆ సంస్థదేనని, అప్పగించిన భూమిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూసేకరణ, భూమి అప్పగింత ప్రక్రియలో రెవెన్యూ, నేషనల్ హైవే అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించుకుంటూ పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులు ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఆర్డీఓ చంద్రకళ, నేషనల్ హైవే అధికారులు, ఆయా మండలాల తహసీల్దార్లు, సర్వే అధికారులు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కేశవరం గ్రామంలో ఘనంగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

మేడ్చల్, మూడుచింతలపల్లి / ప్రజా వాయిస్ ప్రతినిధి :

మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కేశవరం గ్రామంలో మాజీ వార్డు సభ్యుడు, బీఆర్ఎస్ నాయకుడు బొమ్మలపల్లి శ్రీశైలం కు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, స్థానిక కౌన్సిలర్ బొమ్మలపల్లి మల్లేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో ఇల్లు లేని ప్రతి అర్హత కలిగిన నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేద కుటుంబం ఒక్కటి కూడా ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్వారెడ్డి, వీరేశం గుప్తా, శ్రీనాథ్, కట్టికిల కరణాకర్, వెంకటేశం, మల్లేష్ యాదవ్, బొమ్మలపల్లి శ్రీశైలం కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల ఆకస్మిక తనిఖీ

కచ్చితంగా సమయపాలన పాటించాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్





జూలూరుపాడు, ప్రజా వాయిస్:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. వైద్యశాల రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు కావలసిన మందులతో పాటు, పాము కాటుకు కావలసిన ఏ ఎస్ వి, ఏ ఆర్ వి మందులు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. విష జ్వరాలు ప్రబలుతున్నందున గ్రామాలలో, పాఠశాలల్లో పంచాయతీ సిబ్బందితో కలిసి డ్రైడే ఫ్రైడే, ఆరోగ్య శిబిరాలు నిర్వహించడంతోపాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల పోరాటంపై రాష్ట్ర ప్రభుత్వ- నిర్బంధం ఆపాలి

ఆశా వర్కర్ల ఫిక్స్డ్ వేతనం పై ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలోనే తీర్మానంచేయాలి

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము డిమాండ్

ప్రజా వాయిస్.. వనపర్తి

ప్రజాస్వామ్యయుతంగా పోరాటం చేస్తున్న ఆశా వర్కర్స్ పై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాలు ఆపాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తల పై రాష్ట్ర ప్రభుత్వ అణచివేతకు వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం పానగల్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలియజేశారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయమని చలో అసెంబ్లీకి వెళ్లిన ఆశా కార్యకర్తలపై ప్రభుత్వం,పోలీస్ యంత్రాంగం ప్రకటించిన నిర్బంధాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఆందోళనకు పూనుకుంటే మహిళలను అని చూడకుండా,పోలీసులు ఇండ్ల దగ్గరికి వచ్చి భయభ్రాంతులకు గురి చేశారని విమర్శించారు. చలో అసెంబ్లీ కి వెళ్లిన ఆశాలను మార్గ మధ్యలో బస్సులు, రైళ్లలో నుండి బలవంతంగా బయటకు తీసుకెళ్లి కార్యక్రమానికి ఆటంకాలు సృష్టించారని విమర్శించారు.అర్ధంకులను చేధిస్తూ వెళ్ళిన ఆశా కార్యకర్తలను సైతం అక్రమంగా అరెస్టు చేసి రాత్రి వరకు హైద్రాబాద్ లోని వివిధ పోలీస్ స్టేషన్ లలో మహిళలను నిర్బంధించారని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలనే అమలు చేయాలని తాము కోరుతున్నామని కొత్త డిమాండ్లు ఏమి కోరడం లేదని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ



ప్రజాస్వామిక హక్కులను ఉల్లంఘించి, ఇబ్బందులకు గురి చేస్తూ అణచివేత విధానాలకు పాల్పడటం సరికాదన్నారు.తక్షణమే ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలోనే ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీ ప్రకారం ఫిక్స్డ్ వేతనం రూ .18000 అమలు చేసి, అదనపు పని భారాలను తగ్గించాలని,ఆశాలకు పదోన్నతులు కల్పించాలని,లేని పక్షంలో మరో ఉద్యమానికి సిద్ధం అవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు మహేశ్వరి, లలిత, రామేశ్వరి, సరస్వతి, భాగ్య, రుక్మిణి, నాగమణి, సావిత్రి, విజయ తదితరులు పాల్గొన్నారు

పెండింగులో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి

బిజెపి మండల పార్టీ అధ్యక్షులు మారం రవికుమార్


ప్రజావాయిస్ / పాలకుర్తి



బీజేపీ ఆధ్వర్యంలో పాలకుర్తి ఎమ్మార్వో కి వినతి పత్రం పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయి వెంటనే విడుదల చేయాలని భారతీయ జనతా పార్టీ పాలకుర్తి మండల అధ్యక్షుడు మారం రవి కుమార్ మాట్లాడుతూ.. 15000 కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను చెల్లించకుండా 40 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చల గాటం ఆడుతున్న రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి వెంటనే ఫీజు బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి కారణంగా విద్యార్థులు గత 12 ఏళ్ల గా తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని ఉన్నత చదువులు మధ్యలోనే ఆపేసి ఎటు కాకుండా మిగిలి పోతున్నారని స్కాలర్షిప్ బిక్ష కాదు ప్రభుత్వ బాధ్యత అని గుర్తెరిగి వెంటనే పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చెయ్యాలని,నల్ల బ్యాడ్జీల తో నిరసన తెలిపారు., స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కమ్మగాని శ్రీకాంత్ గౌడ్, కడుదుల నిరంజన్ మండల ప్రధాన కార్యదర్శులు పెనుగొండ సోమేశ్వర్, వేల్పుల దేవరాజ్, పూజారి మహేష్, మండల నాయకులు వేమునూరి శ్రీనివాస్, చల్ల వినయ్, బెల్లి సతీష్ తదితరులు పాలుగొన్నారు.

రైతన్న పక్షాన వంగ రాజేశ్వర్ రెడ్డి

విద్యుత్, సాగునీటి సమస్యలపై ఎస్ఈకి వినతిపత్రం



ప్రజా వాయిస్: సిద్దిపేట

సిద్దిపేట రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, వారి పక్షాన ఎల్లవేళలా అండగా ఉంటానని ప్రముఖ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. సిద్దిపేట ప్రాంతంలో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతాంగం ఎదుర్కొంటున్న కరెంట్, సాగునీటి ఇబ్బందులపై ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పార్టీలకు అతీతంగా నిర్వహించిన భారీ రైతు ర్యాలీలో పాల్గొని రైతుల గొంతుకగా నిలిచారు. అనంతరం విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గౌరవ విద్యుత్ శాఖ ఎస్ఈ (రాజు) గారికి వినతిపత్రం అందజేశారు.వంగ రాజేశ్వర్ రెడ్డి డిమాండ్లు మరియు వ్యాఖ్యలు ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం కేవలం 10 గంటల కరెంట్ మాత్రమే వస్తుండటంతో రైతులు పంటలు కాపాడుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోతున్న పంటలను కాపాడాలంటే రైతులకు కనీసం 18 గంటల పాటు నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట చుట్టుపక్కల కాల్వలు ఉన్నప్పటికీ, చెరువుల్లోకి సాగునీరు చేరకపోవడం దురదృష్టకరమన్నారు.రైతు కష్టాల్లో ఉన్నప్పుడు రాజకీయాలు పక్కనబెట్టి నిలబడటమే తన బాధ్యతని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, అందుబాటులో ఉన్న నీటి వనరులను వినియోగిస్తూ చెరువులు, కుంటలను నీటితో నింపేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు.

తండా డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలి

సేవాలాల్ సేన 11వ ఆవిర్భావ దినోత్సవంలో నాయకుల డిమాండ్.!

ప్రజావాయిస్/ పాలకుర్తి

తండాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేకంగా తండా డెవలప్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయాలని సేవాలాల్ సేన నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవరుప్పుల మండల ధరావత్ తండాలో బుధవారం సేవాలాల్ సేన 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన జెండాను ఆవిష్కరించి, సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ధారావత్ తండాలో సేవాలాల్ సేన మండల అధ్యక్షులు కునుసోత్ బిక్కు నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ధారావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ. బంజారా జాతి ఐక్యత కోసం 2015 సెప్టెంబరు 9న సరూర్‌నగర్ స్టేడియంలో సేవాలాల్ సేన ఆవిర్భవించిందని తెలిపారు. అప్పటి నుంచి తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలని, సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని పలు పోరాటాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.తండాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని, తండాల్లో రోడ్లు, తాగునీరు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బంజారా తండాలు, కాలనీల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు తండా డెవలప్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.రాజకీయ పార్టీలకు అతీతంగా జాతి సమస్యలపై బంజారా సమాజం ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో చేపట్టే ఉద్యమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. యువత విద్య, ఉద్యోగాల్లో ముందుకు సాగడంతో పాటు బంజారా సంస్కృతి, సంప్రదాయాలు, సేవాలాల్ మహారాజ్ ఆశయాలను భావితరాలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ధరావత్ ప్రకాష్ నాయక్, జిల్లా నాయకులు ధరావత్ స్వామి నాయక్, వాంకుడోత్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ గేమ నాయక్ కీమా నాయక్,, వార్డు సభ్యులు కునుసోతు లింగ, మధుకర్, దీజ్రో మండల మోర్చ అధ్యక్షులు మూడ అన్వేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవు నాయక్ కునుసోతు రాము, ధరావత్ శ్రీను గ్రామ సిబ్బంది యాదమ్మ, కల తదితరులు పాల్గొన్నారు.



చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

- గజ్వేల్ ఉద్యోగుల టీఈజేఏసీ పిలుపు
- పీఆర్‌సీ, పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలి
- సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలు చేయాలి
- టీఎన్‌జీవో గజ్వేల్ అధ్యక్షుడు ఎస్. రాజశేఖర్‌రెడ్డి



ప్రజా వాయిస్ గజ్వేల్ :

ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ‘చలో హైదరాబాద్’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గజ్వేల్ ఉద్యోగుల టీఈజేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో గజ్వేల్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు.చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన కార్యాచరణ, ఉద్యోగుల భాగస్వామ్యం, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా టీఎన్‌జీవో గజ్వేల్ అధ్యక్షుడు ఎస్. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ప్రధాన డిమాండ్లు: పీఆర్‌సీని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ స్థానంలో ఓపీఎస్‌ను అమలు చేయాలని, ఈహెచ్ఎస్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 317 జీవోకు సంబంధించిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉద్యోగులకు సంబంధించిన ఇతర పెండింగ్ సమస్యలను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ‘చలో హైదరాబాద్’ కార్యక్రమానికి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని టీఈజేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో గజ్వేల్ కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి భరత్, టీఎన్‌జీవో సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్, సిద్దిపేట కలెక్టరేట్ విభాగం ఉపాధ్యక్షుడు మధుకర్, టీఎన్‌జీవో గజ్వేల్ సంయుక్త కార్యదర్శి జె. సతీష్‌కుమార్, వ్యవస్థాపక కార్యదర్శి ఆర్. భానుకుమార్, తెలంగాణ ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం 3194 ఐఎన్‌టీయూసీ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు ఆదిమూలం నారాయణ, ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్‌తో పాటు పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



రాజీ మార్గమే రాజమార్గం..

సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్న సిద్దిపేట్ సీపీ ఎస్. రష్మీ పెరుమాళ్

ప్రజా వాయిస్: సిద్దిపేట్

చిన్న చిన్న కేసుల వల్ల కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృధా చేసుకోవద్దని సిద్దిపేట్ పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్, ఐపిఎస్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నెల సెప్టెంబర్ 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న కంపౌండబుల్ కేసులలో ఉన్న ప్రజలకు ఒక మంచి అవకాశమని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. రాజీపడదగిన కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబపరమైన వివాదాలు, రోడ్డు ప్రమాదాల కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్ మరియు చెక్ బౌన్స్ వంటి కేసులలోని నిందితులు, ఫిర్యాదీదారులు నేరుగా సంబంధిత పోలీస్ స్టేషన్‌ను కానీ లేదా న్యాయస్థానాన్ని కానీ సంప్రదించి సయోధ్య కుదుర్చుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు చాలా త్వరగా న్యాయం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు.ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకునేలా పోలీస్ అధికారులు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాజీపడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు సీపీ రష్మీ పెరుమాళ్ వెల్లడించారు. జుడిషియల్ డిపార్ట్‌మెంట్ కల్పించిన ఈ అద్భుత అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

దళితులు నడిచారని రోడ్లను పసుపు నీళ్లతో కడగడం సిగ్గుచేటు

- ఎర్రవల్లి సమీప గ్రామాల్లో కొనసాగుతున్న అస్పృశ్యత, కుల వివక్షత
- యుగాలు, తరాలు మారినా కుల వివక్షత కొనసాగడం బాధాకరం
- అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి తెరపైకి చేస్తున్న కెసిఆర్ దొర పెత్తందారి వ్యవస్థ
- దొర అహంకారాన్ని ఒంట పట్టించుకున్న బిఆర్ఎస్ నేతలు
- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ ఆగ్రహం

ప్రజా వాయిస్ గజ్వేల్ :

ఎర్రవల్లి సమీప గ్రామాలలో దళితులు డప్పు చప్పులతో నడిచారని బిఆర్ఎస్ నేతలు పసుపు నీళ్లతో రోడ్లు శుభ్రం చేయడం సిగ్గుచేటు కాగా, కెసిఆర్ దొర అహంకారాన్ని ఒశేట బట్టించుకున్న ఆ పార్టీ నేతల వైఖరి ఈ సంఘటనతో బహిర్గతం అయ్యిందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ విమర్శించారు. బుధవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అసెంబ్లీ సాక్షిగా దూర్భాషలాడగా, అదే దారిలో వెళ్తున్న ఆ పార్టీ నేతలు అంటరానితనం, అస్పృశ్యత, కుల వివక్షత చూపిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని బిఆర్ఎస్ నేతలు విస్మరించి కెసిఆర్ ఫ్యూడలిజాన్ని తెరపైకి తెస్తుండగా, ఈ చర్య సమాజ శ్రేయస్సుకు ఎంత మాత్రం శ్రేయస్కరం కాదని నిలదీశారు. యుగాలు, తరాలు మారినా గ్రామాల్లో కుల వివక్షత కొనసాగడం దురదృష్టకరం కాగా, సామాజిక ప్రజాస్వామ్యంతోనే దళితులకు నిజమైన స్వాతంత్ర్యం వస్తుందని అన్నారు. దళిత సమాజాన్ని కించపరిచే విధంగా వ్యవహరించిన బిఆర్ఎస్ నేతలను పార్టీ నుండి బహిష్కరించాలని, లేనిపక్షంలో కెసిఆర్ దళిత వ్యతిరేక వ్యక్తిగా చరిత్రలో నిలుస్తారని చెప్పారు. రోడ్లపై దళితులు నడిచారని పసుపు నీళ్లు చల్లి ఆ దుశ్చర్యకు పాల్పడిన నేతలు క్షమాపణ చెప్పని పక్షంలో నియోజకవర్గంలోని దళిత సమాజాన్ని చైతన్యం చేసి తగిన గుణపాఠం చెప్తామని వివరించారు.



లక్కారంలో ‘కమ్యూనిటీ కాంటాక్ట్’ ప్రోగ్రామ్


- 62 ద్విచక్ర వాహనాలు తనిఖీ
- గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన పోలీసులు




ప్రజా వాయిస్ ముత్తారం

లక్కారం గ్రామంలో బుధవారం సాయంత్రం మంథని సీఐ పర్యవేక్షణలో ముత్తారం పోలీసులు విస్తృత స్థాయిలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. గ్రామంలో ఆకస్మికంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 62 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, వాటికి సంబంధించిన కాగితాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంథని సీఐ, ముత్తారం ఎస్సై మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, ఓటీపీలకు లొంగిపోవద్దని హెచ్చరించారు. యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ప్రయాణాల్లో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ?గ్రామంలో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా అక్రమ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంథని సర్కిల్ పరిధిలోని పలువురు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బోదులబండ ఉన్నత పాఠశాలలో అధికారుల తనిఖీ!





విద్యార్థులకు ఉచిత బూట్లు అందజేత.. మెనూ ఉల్లంఘనపై హెచ్చరికలు

నిబంధనలు గాలికి వదిలేస్తే ఉపేక్షించబోం: రవిబాబు హెచ్చరిక

ప్రజా వాయిస్ ఖమ్మం:

ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలంలోని బోదులబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విభాగాన్ని మండల ప్రత్యేక, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి బి. రవిబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వంటశాల, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించిన ఆయన, పాఠశాలలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, మెనూ పాటించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్థానిక ప్రధానోపాధ్యాయుడిని హెచ్చరించారు. నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని సమయానికి అందించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అనంతరం, ప్రభుత్వం పాఠశాలకు సరఫరా చేసిన ఉచిత బూట్లను స్థానిక ఎంపిడిఓ యం.యర్రయ్య అధికారి, మండల విద్యాధికారి చలపతిరావుతో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బొమ్మల రామారం మండల నూతన తహశీల్దార్‌గా పి. రాధ బాధ్యతలు

ప్రజా వాయిస్ / బొమ్మలరామారం : యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండల తహశీల్దార్‌గా పి. రాధ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత మూడు సంవత్సరాలుగా తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన పునుకుల శ్రీనివాసరావు పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో పి. రాధ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తామన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన విధుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆర్ఐ వెంకట్‌రెడ్డితో పాటు రెవెన్యూ సిబ్బంది నూతన తహశీల్దార్ పి. రాధను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.





మాటేడు శివారులో ఘోర రోడ్డు ప్రమాదం

తొర్రూర్ ప్రజా వాయిస్

తొర్రూరు మండలం మాటేడు గ్రామ శివారులో బుధవారం తెల్లవారుజాము ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముగ్గురు యువకులు ఒకే బైక్‌పై ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టినట్లు సమాచారం.ప్రమాదం అనంతరం ట్రిపుల్ రైడింగ్ చేసిన యువకులు అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో ఎదురుగా బైక్‌పై వస్తున్న మాటేడు గ్రామానికి చెందిన చీకటి శ్రీను (50) తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు సమాచారం.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదంపై వివరాలు సేకరిస్తున్నారు. పరారైన యువకుల కోసం గాలింపు చేపట్టినట్లు తెలుస్తోంది.ప్రమాదానికి గల పూర్తి కారణాలు, పరారైన యువకుల వివరాలు, పోలీసుల తదుపరి చర్యలకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.



బొమ్మలరామారంలో పీస్ కమిటీ సమావేశం

వినాయక శోభాయాత్రలో డీజేలకు అనుమతులు లేవు: ఎస్సై బుగ్గ శ్రీశైలం

ప్రజా వాయిస్ / బొమ్మలరామారం : యాదాద్రి భువనగిరి జిల్లా వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో బొమ్మలరామారం మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులతో బొమ్మలరామారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై బుగ్గ శ్రీశైలం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. వినాయక ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సర్పంచులతో చర్చించారు.ఈ సందర్భంగా ఎస్సై బుగ్గ శ్రీశైలం మాట్లాడుతూ వినాయక నిమజ్జన శోభాయాత్రలో డీజేలకు అనుమతులు లేవని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.వినాయక ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మండల ప్రజలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వినాయక ఉత్సవ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఎస్సై కోరారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.



ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా ఘన నివాళులు

ప్రజా వాయిస్/ అనుమల:

ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజి నారాయణరావు గారి జయంతి సందర్భంగా హాలియా పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి కాళోజి నారాయణరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను తన కవిత్వం ద్వారా సమాజానికి చాటిచెప్పిన కాళోజి నారాయణరావు గారి సాహితీ సేవలు, ప్రజా ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలిచిన మహనీయుడి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో హాలియా మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ , 2వ వార్డు కౌన్సిలర్ సలహాదారులు నకిరేకంటి సైదులు, 4వ వార్డు కౌన్సిలర్ సలహాదారులు కడమంచి శ్రీను, 5వ వార్డు కౌన్సిలర్ సలహాదారులు చిట్టిపోలు కరుణాసాగర్, 8వ వార్డు కౌన్సిలర్ సలహాదారులు మజహర్, 9వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, 11వ వార్డు కౌన్సిలర్ దేపావత్ ప్రసాద్, 12వ వార్డు కౌన్సిలర్ సలహాదారులు ఎడవల్లి రంజిత్, మున్సిపల్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొని కాళోజి నారాయణరావు కి ఘన నివాళులర్పించారు.

ప్రజా వాయిస్



ఎమ్మెల్సీల పదవులు శాశ్వతంగా రద్దు చేయాలి

ప్రజావాయిస్,మోత్కూరు (సెప్టెంబర్9):

తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను హేళన చేస్తూ,అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధు , నవీన్ రెడ్డి ల పదవి కాలాన్ని వెంటనే శాశ్వతంగా రద్దు చేయాలని, ప్రతిపక్ష నాయకుడు కల్వకుంట్ల చెంద్రశేఖర్ రావు, బిఆర్ఎస్ పార్టీ అహంకార, నియంతృత్వ పోకడలను నిరసిస్తూ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఆదేశాల మేరకు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కెసిఆర్ దిష్టిబొమ్మ ను దగ్ధం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్, పట్టణ అధ్యక్షులు గుండగొని రామచంద్రు గౌడ్ , పిఏసిఎస్ చైర్మెన్ పేలపూడి వెంకన్న ,డీసీసీ కార్యదర్శి కూరెళ్ల శ్రీరాములు,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం జయశ్రీ, జిల్లా కాంగ్రెస్ నాయకులు బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి,గడ్డం సోమనర్సయ్య,యూత్ కాంగ్రెస్ జల్లా నాయకులు మందుల సురేష్, మాజీ సర్పంచ్ మర్రిపెల్లి యాదయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు సూరరం నవీన్, పల్లెర్ల భాస్కర్,చిరుమర్తి యాదయ్య, మండల కాంగ్రెస్ నాయకులు లెంకల వేణు,ఏర్ల శ్రీను, పురుగుల నర్సిహ్మ, ఎడ్ల భగవంత్, పల్లె భిక్షం, మెంట యాదగిరి,దొండ శ్రీశైలం,జిట్ట లక్ష్మణ్,నోముల రమేష్,ఎలుగు యాదయ్య,గుండా రాములు,పల్లపు సమ్మయ్య,ఆలకుంట్ల నర్సిహ్మ,మీడిదొడ్డి పురుషోత్తం, ముక్కముల నర్సయ్య, ఆలకుంట్ల రాజు,కురిమెటి విక్రమ్,చిప్పలపల్లి గోవర్ధన్,తాటిపాముల మహేందర్ సల్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



వాసాలమర్రిలో కొలువైన పంచముఖ ఆంజనేయ స్వామికి వైభవంగా వార్షికోత్సవం

ప్రజా వాయిస్/తుర్కపల్లి

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ప్రథమ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పాండురంగ ఆశ్రమం వేద పండితులు గణపతి పూజా, పుణ్యావాచనం, స్వామివారికి పంచామృతాభిషేకం, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమాన్ని విగ్రహ దాత కోలా ఆంజనేయులు సుగుణమ్మ దంపతులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోలా రాంప్రసాద్, సౌజన్య, అనురాధ, అరుణమ్మ ,అపర్ణ, ఆశాలత ,శ్రీ పాండురంగ ఆశ్రమం వేద పండితులు అప్పల సత్యనారాయణ శర్మ, అప్పల గోపాల శర్మ ,అప్పల రాధాపతి శర్మ, అప్పల భవానంద శర్మ ,సత్యం పంతులు, రాంపండు పంతులు, పలుగుల శ్రీరాములు, పలుగుల దుర్వాసులు, పలుగుల ఆంజనేయులు, గోనే శ్రీనివాస్, జైని కుమారస్వామి, జైని మురళీధర్, జైని రామ్మోహన్, జై ని చంద్రశేఖర్ ,జైని రాజేశ్వర్ ,తడక కృష్ణ, సింగం వెంకటేశం, వసలమర్రి గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

"కాళోజి ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం"

సర్పంచ్ ఎలికట్టి భరత్



ప్రజా వాయిస్ వేములపల్లి: కాళోజి ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని సర్పంచ్ ఎలికట్టి భరత్ అన్నారు బుధవారం నల్గొండ జిల్లా వేములపల్లి మండల పరిధిలోని లక్ష్మీదేవి గూడెం గ్రామ పంచాయతీలి కార్యాలయంలో తెలుగు భాష దినోత్సవం మరియు ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ , తెలంగాణ అస్తిత్వాన్ని, భాష చైతన్యాన్ని తన కలం ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన మహోనీయుడు కాళోజి అనిలి."నా గొడవ"కావ్యం ద్వారా సమాజంలోని అన్యాలపై ఆయన చేసిన పోరాటం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని . ఆయన పుట్టినరోజును తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ భాష దినోత్సవం గా ప్రకటించడం మనందరికీ గర్వకారణం అని కాళోజీ ఆశయాలకు అనుగుణంగా గ్రామ అభివృద్ధికి మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలనిలి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జి.కళ్యాణి, ఉప సర్పంచ్ గంట స్వాతి నర్సయ్య, పేరాల రామలింగరావు, పేరాల వేణు,పడిదల శ్రీను, కరుణాకర్ రెడ్డి, వనాకర్ రెడ్డి, ముత్యాల కృష్ణ, ముత్యాల హరిచంద్ర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బోడగుట్ట జాతరకు సర్వం సిద్ధం

భక్తుల రాకకు విస్తృత ఏర్పాట్లు..

పటిష్ఠ పోలీసు బందోబస్తు

ప్రజా వాయిస్ వాంకిడి

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని సరండి గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం నిర్వహించనున్న భవాని మాత, ఎల్లమ్మ తల్లి బోడగుట్ట జాతర మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాతరకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు.సర్పంచ్ మొహర్లే బాపూజీ ఆధ్వర్యంలో సీఐ వేణుగోపాల్, ఎస్సై మహేందర్ జాతర ప్రాంగణాన్ని పరిశీలించారు. భక్తుల రాకపోకలు, వాహనాల నియంత్రణ, రద్దీ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ బాపూజీ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులు క్రమశిక్షణ పాటిస్తూ పోలీసు సిబ్బంది, నిర్వాహకులకు సహకరించాలని కోరారు. భవాని మాత, ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు పొందేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సోనం, ఉపసర్పంచ్ గుర్నులే డోడ్డజి (బాపన్), వార్డు సభ్యులు విజయ్, రమాదేవి, మహేశ్వరి, సీనియర్ మెట్ రాజ్‌కుమార్, స్థానికులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.



కోనేరు కోనప్పపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

అభివృద్ధిపై మాట్లాడకుండా వ్యక్తిగత విమర్శలు సరికాదు

బీఆర్ఎస్ నేత సంతోష్ గౌడ్

ప్రజా వాయిస్ కగజ్ నగర్

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు కోనేరు కోనప్పపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంభగౌని సంతోష్ గౌడ్ హెచ్చరించారు. దహెగాం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు ప్రజా సమస్యలు, అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. కోనేరు కోనప్ప హయాంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు జరిగాయని, పెద్దవాగుపై రెండు, ఎర్రవాగుపై రెండు వంతెనలు నిర్మించారని పేర్కొన్నారు.రాజకీయ విమర్శలు సహజమేనని, అయితే వ్యక్తిగత దూషణలకు దిగడం రాజకీయ సంస్కారం కాదన్నారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో ప్రతిపక్ష నాయకులను ఇష్టానుసారంగా విమర్శిస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు. ఇకనైనా వ్యక్తిగత విమర్శలు పక్కనపెట్టి ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై మాట్లాడాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు

ఫరీద్ పేట గ్రామ సభ సభలో పాల్గొన్న మండల అధికారులు

ప్రజా వాయిస్ పాల్వంచ సెప్టెంబర్ 9.

గ్రామ ప్రజల అభివృద్ధి గ్రామ సంక్షేమం ప్రజల అవసరాల పై చర్చించేందుకు పాల్వంచ మండలం ఫరీద్ పేట్ గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో అర్హులైన ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్రూమ్ అందజేస్తామన్నారు. గ్రామంలో ప్లాస్టిక్ వాడకం నియంత్రణలోకి తెచ్చి పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపడతామన్నారు. వీలైనంత త్వరలో ప్లాస్టిక్ వాడకుండ చేయడానికి కార్యచరణ తీసుకుంటామన్నారు. గ్రామ ప్రజల సమస్యలను అవసరాలను విన్న అధికారులు ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని గ్రామ ప్రజలకు అధికారులు హామీ ఇచ్చారు. ఈ గ్రామ సభలో ఫరీద్ పేట్ గ్రామ సర్పంచ్ జీడిపల్లి నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ కోల బాల గౌడ్, ఎమ్మార్వో జనార్దన్ రెడ్డి పంచాయతీ కార్యదర్శి లావణ్య, వార్డు సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరయ్యారు.